



డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష నాయకులు

ఉత్తీర్ణతలో తల్లిదండ్రుల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతలో తల్లిదండ్రుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సూచించారు. ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలను మెంటర్‌గా ఎంపిక చేసుకున్న కలెక్టర్, శనివారం ఎ-క్యాంప్‌లో సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులకు మార్గదర్శకత్వం చేశారు. తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడి పెట్టకుండా చదువుకు అనుకూల వాతావరణం కల్పించాలన్నారు. మంచి ఆహారం, మొబైల్ నియంత్రణ, పాఠశాల హాజరు, ఆత్మవిశ్వాసం కల్పించాలన్నారు. 100 రోజుల ప్రణాళికలో ప్రతిరోజు సాయంత్రం పరీక్షలు, యూనిట్ టెస్ట్‌లలో 20కి 15 మార్కులకు పైగా రాయాలన్నారు. ఉపాధ్యాయులు 100శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థుల ఫిర్యాదులపై అన్నం, కోడిగుడ్డు, సాంబార్ బాగా ఉడకాలని వంట సిబ్బందిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట డిఇఒ సుధాకర్, పాఠశాల హెడ్‌మాస్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

బిఎల్‌ఒలను వెంటనే నియమించుకోవాలి

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాలకు బూత్‌లెవెల్ ఏజెంట్లను వెంటనే నియమించుకోవాలని జిల్లా కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.సిరి రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో పార్టీలతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఓటర్ల మ్యాపింగ్ 47.90శాతంతో రాష్ట్రంలో 14వ స్థానంలో ఉందని, జనవరి చివరి నాటికి 75-85శాతం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సరిగా పని చేయని ఇద్దరు బిఎల్‌ఒలను సస్పెండ్ చేశామని హెచ్చరించారు. ముందు ఇవిఎం గోడౌన్ తనిఖీ చేశారు. సమావేశంలో డిఆర్‌ఒ వెంకటనారాయణమ్మ, బహుజన్ సమాజ్ పార్టీ అరుణ్ కుమార్, టిడిపి గట్టు అన్వేష్, జనసేన పార్టీ తల్లా మంజునాథ్, బిజెపి పార్టీ నుండి పిటి.సాయి ప్రదీప్, కాంగ్రెస్ బజారన్న హాజరయ్యారు.



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ఎన్ఆర్ఇజిఎస్ చట్టాన్ని కొనసాగించాలి

-విబిజిరామ్‌జి పథకాన్ని రద్దు చేయాలి
- డిఆర్‌ఒకు వామపక్ష పార్టీల వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విబిజిరామ్‌జి స్కీమ్‌ను రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీచట్టాన్ని కొనసాగించాలని వామపక్ష పార్టీలు, ఈరోజు డిఆర్‌ఒకు వినతిపత్రం ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వాళ్లలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ, కెవి.నారాయణ, నగర కార్యదర్శి రాజశేఖర్, సిపిఐ జిల్లా నాయకుడు శ్రీనివాసులు ఉన్నారు. వారు వినతిపత్రంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని వామపక్ష పార్టీల మద్దతుతో ఏర్పడిన నాటి యుపిఎ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. సరిగా 20 సంవత్సరాల తర్వాత మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని, రద్దుచేసి విబిజిరామ్‌జి స్కీముగా మార్పు చేసి గ్రామీణ పేదలకు, బడుగు బలహీన వర్గాల వారికి పట్టెడన్నం పెట్టే చట్టాన్ని రద్దు చేయడం దుర్మార్గమని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ చట్టం వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి, రైతుల అభివృద్ధి జరిగిందన్నారు. పేదల వలసలు తగ్గాయని, కరోనా కాలంలో రైతులకు కూలీ పేద ధనిక అని తేడా లేకుండా అందర్నీ ఆదుకున్న చట్టం ఉపాధి హామీ చట్టమని వారు వినతి పత్రంలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బుద్ధిపూర్వకంగా పెట్టుబడి దారులు, కార్పొరేట్లకు ఊడిగం చేసే ప్రభుత్వమని వారు విమర్శించారు. 125 రోజుల పని దినాలు కల్పిస్తామంటూ తప్పుడు ప్రచారం చేసి 90 శాతం ఇచ్చే నిధులను 60శాతం కుదించారన్నారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి మహాత్మా గాంధీని హత్య చేసిన నాథు రాం గాడ్సే పేరు కలిసేలాగా చేర్చి, రామరాజ్యం కావాలని కలలు కన్నవాడు మహాత్మా గాంధీ అందుకే రామ్ అనే పేరు కలిసేలాగా చేర్చామని చెప్పడం సిగ్గుచేటని వారు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని విబిజి రాంజీని రద్దు చేయాలని కోరారు.

రేపటి నుంచి సిఐటియు జీపుజాతా

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభలు జయప్రదం చేయాలని,జనవరి 4న విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభకు భారీగా కార్మిక వర్గం కదలి రావాలని కార్మికులకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి.అంజిబాబు పిలుపునిచ్చారు. శనివారం కార్మిక కర్షక భవన్‌లో మహాసభల జయ ప్రధానికై పోస్టర్లు, బ్యానర్లు విడుదల చేశారు. ఈనెల 29న కర్నూలు జిల్లాలో జరిగే జీపు జాతాను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్ రాధాకృష్ణ, ఎండి అంజిబాబు కార్మిక వర్గాన్నికోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గ హక్కులను కాలరాస్తూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్పు చేస్తూ యజమానులకు తొత్తులుగా ఈ ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని వారన్నారు. కార్మిక చట్టాలు మార్పు వల్ల కార్మికులకు ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కార్మిక వ్యతిరేక జిఒలు విడుదల చేస్తూ కార్మికుల ప్రయోజనాలను ప్రభుత్వాలు కాల రాస్తున్నాయన్నారు. భవన నిర్మాణం, హమాలి, ఆటో, అసంఘటితనంగా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని ఉద్యోగ కార్మిక హక్కులను కాపాడాలని 18వ మహాసభలో చర్చించి రానున్న కాలంలో పోరాటాలు నిర్వహిస్తారన్నారు. జనవరి 4న జరిగే బహిరంగ సభ ద్వారా పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలని, బహిరంగ సభకు హలో కార్మిక చలో విశాఖ పేరుతో తరలిరావాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకులు సిహెచ్.సాయి బాబా, కె. ప్రభాకర్, బతుకన్న కార్మికులు పాల్గొన్నారు.



గోడపత్రికలు, బ్యానర్లను విడుదల చేస్తున్న నాయకులు

ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల అభివృద్ధికి కృషి

- ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం కెవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీ నిధులు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించిన షెడ్డును ఆయన ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయన్నారు. ఎంత కష్టపడితే అంత ఫలితం వస్తుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అంతకుముందు తన ఎంపీ నిధులు కేటాయించి కళాశాలలో షెడ్డును నిర్మించిన ఎంపీ నాగరాజును కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు సన్మానించారు. ఆర్ఐఒ లాలెప్ప, కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ ప్రభు చరణ్ పాల్గొన్నారు.

స్టాంటన్‌పురంలో క్రిస్మస్ వేడుకలు : స్టాంటన్ పురంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో కెడిసిసిబి చైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డి, కర్నూలు పార్లమెంట్ ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంపీ నాగరాజు మాట్లాడుతూ... క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొంటూ, అన్ని మతాలు పరస్పర గౌరవంతో ఉండాలని పేర్కొన్నారు. కెడిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ... క్రిస్మస్ పండుగ ప్రేమ, క్షమ, త్యాగం, శాంతి మానవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ ముందుగా క్రైస్తవ సోదర సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, క్రిస్మస్ పండుగ ప్రేమ, త్యాగం, శాంతి సందేశాన్ని అందిస్తుందని పేర్కొంటూ, సమాజంలో ఐక్యత, సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని కోరారు. వార్డు ఇన్చార్జి కురువ చంద్రశేఖర్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, క్రైస్తవ సంఘ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



షెడ్డును ప్రారంభిస్తున్న ఎంపీ నాగరాజు

'ఉల్లి'కి దక్కని పరిహారం...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు 43,817 ఎకరాలు కాగా ఈ ఏడాది 26,696 ఎకరాల్లో ఉల్లి సాగైంది. ఎకరం విస్తీర్ణంలో ఉల్లి సాగు చేసేందుకు విత్తనాలకు, రసాయనిక ఎరువులకు, సేద్యానికి రూ.4 వేలు, కలుపు తీయడానికి, క్రిమిసంహారక మందులకు, కోతలకు కలిపి రూ.1.5 లక్షల పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. ఈ ఏడాది ఆగస్టులో కురిసిన వర్షాలకు ఉల్లి దెబ్బతినడంతో మార్కెట్‌లో ధర దక్కలేదు. క్వింటా కనిష్ట ధర రూ.501కి పడిపోయింది. కర్నూలు మార్కెట్‌కు సరుకు తెచ్చినా ధర లేక బయట తక్కువ ధరకు అమ్ముకుని వెళ్లిపోతున్నారని పత్రికల్లో కథనాలు రావడంతో స్పందించిన ముఖ్యమంత్రి మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ.1200కు కొనుగోలు చేస్తామని ప్రకటించారు. ప్రారంభించిన మూడు రోజులకే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లు ఆపేశారు. మూడు రోజుల్లో 1226 టన్నుల మాత్రమే ఉల్లిని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేశారు. నిల్వ చేసుకోవడానికి వీలు లేకపోవడంతో కొనుగోళ్లు ఆపేశారు. క్వింటా రూ.1200కు కొన్నా కూడా రైతుకు నష్టమే వచ్చింది. రైతుకు పెట్టుబడి కూడా దక్కలేదు. ఆ తరువాత ట్రేడర్లు కొనుగోలు చేసిన ధర రూ.1200 కంటే తక్కువ ఉంటే ఆ తేడా మొత్తాన్ని బోనస్‌గా రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా అందుకు పలు నిబంధనలు పెట్టడంతో రైతులకు ప్రభుత్వం నమ్మకం కలగలేదు. దీంతో చాలా మంది రైతులు పొలాల్లోనే వదిలేశారు. పత్తికొండ మండలం ఎం.అగ్రహారానికి చెందిన రైతు ప్రభాకర్ రెడ్డి రెండు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాడు. కోత కూడా కోశాడు. ధరలేదని పొలం పక్కడే పారబోశాడు. అదే మండలంలోని చిన్నహుల్తికి చెందిన చెన్నయ్య కూడా రెండు ఎకరాల్లో ఉల్లిని సాగు చేసి పంటను దున్నేశాడు. దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామంలో రేమట వలి సాహెబ్ అనే రైతు 4.50 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన పంట చేతికి వచ్చిన సమయానికి ఉల్లి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పొలంలోనే గొర్రెలకు వదిలేశాడు. ఆ పరిస్థితుల్లో ఉల్లి రైతులకు హెక్టారుకు రూ.50 వేలు ఇస్తామని స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. సెప్టెంబర్‌లో ఈ ప్రకటన చేసినా నేటికీ అమలుకు నోచుకోలేదు. ఆ పరిహారం పరిహాసంగానే మిగిలిపోయింది. ఏమి చేయాలో తెలీక దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారు.

ఉపాధి హామీ నిర్వీర్యంపై నిరసనలు : ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

టిడిపికి నూతన జిల్లా అధ్యక్షులు : టిడిపి జిల్లా అధ్యక్షులను ఆ పార్టీ నియమించింది. రెండు జిల్లాల అధ్యక్ష పదవులు మహిళలకే దక్కాయి. కర్నూలు జిల్లా అధ్యక్షురాలిగా గుడిసె కృష్ణమ్మను నియమించారు. నంద్యాల జిల్లా అధ్యక్షురాలిగా గౌరు చరితా రెడ్డిని నియమించారు. కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శిగా పూల నాగరాజు యాదవ్‌ను, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్ఎండి ఫిరోజ్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు.

చలి పంజా : జిల్లా చలి పంజా విసురుతోంది. తెల్ల వారేసరికి పొగ మంచు కమ్మేస్తుంది. నిన్న, మొన్నటి వరకు తొలి పొద్దునుంచే కనిపించే సూర్యుడు ఇప్పుడేమో ఉదయం 8:30 అయినా కనబడడం లేదు. రోజు రోజుకు శీతల పవనాలు ఎక్కువగా వస్తుండడంతో ప్రజలు గజగజలాడుతున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచి చలిగాలు వీస్తున్నాయి. చలికి తట్టుకోలేక వృద్ధులు, చిన్నారులు వణికిపోతున్నారు. పొగ మంచు వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. కొందరు వాహనాలను రోడ్డు పక్కన గా నిలిపేస్తుండగా మరికొందరు లైట్లు వేసుకొని పొగ మంచును దాటేస్తున్నారు. మరోవైపు చలి కారణంగా వ్యాధులు విజృంభిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులు ఇళ్లలోనే వెచ్చగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

అవీ..ఇవీ..అన్నీ..

విశాఖలో జరుగుతున్న సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. జెండా ఆవిష్కరణలు చేశారు. శ్రామిక్ ఉత్సవ్ పేరుతో కళారూపాల ప్రదర్శన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా పోలియో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. పలు ప్రాంతాల్లో సిపిఐ వందేళ్ల వేడుకలను నిర్వహించారు.





సైబర్ నేరాలపై అవగాహన


మహిళల భద్రతకు కు పటిష్ట చర్యలు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

మహిళల భద్రత కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తియాప్, శక్తి వాట్సాప్ నంబర్ల పై, మహిళల పై జరిగే నేరాలు, సైబర్ నేరాల గురించి పాఠశాలలు, కళాశాలల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్‌ల అధికారులు , శక్తి టీం బాఆందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, విద్యార్థినిలకు , మహిళలకు వాటి సేవలను వివరిస్తున్నారని జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. శక్తి టీం బందాలు మహిళలకు, బాలికలకు పాఠశాల, కళాశాలలో విద్యార్థినిలకు శక్తి యాప్, సైబర్ నేరాలు , గుడ్ టచ్ అండ్ బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, ఈవ్ టీజింగ్ లపై విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో శక్తి టీం బృందాలు జన సంచారం ఉన్న ప్రాంతాలతో పాటు, పలు పాఠశాలల్లో విద్యార్థులకు డయల్ 112, డయల్ 100,1098, 1930, శక్తి యాప్ , మహిళలు అత్యవసర సమయాల్లో నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు శక్తి' వాట్సప్ 7993485111 నెంబర్ ను మహిళలు, చిన్నారుల భద్రత కోసం సేవ్ చేసుకోవాలన్నారు. ఎక్కడైనా గంజాయి , డ్రగ్స్, మాదక ద్రవ్యాల సేవించడం చూసినా విక్రయాలు, వినియోగం గురించి సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972 కు అందించాలన్నారు. ఈవ్‌టీజింగ్, ప్రేమ పేరుతో మోసాలు , మహిళలపై జరిగే నేరాలపై, చట్టాలపై అవగాహన కల్పించారు. 2025 జనవరి నుండి డిసెంబర్ 27 వరకు శక్తి యాప్‌ను జిల్లాలో 21,033 మంది డౌన్లోడ్ చేసుకున్నారని జిల్లా ఎస్పి తెలిపారు.

ఆస్పత్రిలో బాధితులను పరామర్శించిన ఆదిమూలపు సతీష్

ప్రజాశక్తి -కోడుమూరు



మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు బాధితులు అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని కోడుమూరు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సతీష్ పరామర్శించారు. ఆనుగొండ గ్రామానికి చెందిన పింజరి కమల్ అనే వ్యక్తి అప్పుల బాధ తట్టుకోలేక విషం తాగి ఆసుపత్రిలో చేరారు. ఈ విషయాన్ని వైసిపి నాయకులు రాజారెడ్డి ద్వారా తెలుసుకొని ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ముడుమలగుర్తి గ్రామానికి చెందిన అయ్యన్న నరాల సమస్యతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేరారని విషయాన్ని మహేశ్వర్ ద్వారా తెలుసుకొని ఆదిమూలపుసతీష్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు.

విశాఖ శ్రామిక ఉత్సవానికి తరలిన పిఎన్ఎం కళాకారులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిఐటియు 18 వ అఖిలబారత మహాసభల సందర్భంగా శనివారం నుండి విశాఖపట్నంలో నిర్వహించే శ్రామిక ఉత్సవ్‌లో పాల్గొనేందుకు కర్నూలు జిల్లా ప్రజానాట్యమండలి కళాకారులు శనివారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఇ.రాజు ఆధ్వర్యంలో 22 మంది కళాకారులు విశాఖకు వెళుతున్నట్లు తెలిపారు. కర్నూలు రైల్వే స్టేషన్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి.అంజిబాబు, చిన్న వ్యాపారస్తుల సంఘం న్యూ సిటీ నాయకులు ఎస్. ఎండి. రఫీలు వారికి సెండ్ ఆఫ్ చెప్పు మాట్లాడారు. కర్నూలు జిల్లా ప్రజానాట్యమండలి కళాకారులు ఆట, మాట, పాట, నాటికలు, నృత్య రూపకాలతో విశాఖలో జరిగే శ్రామిక ఉత్సవంలో తమ ప్రతిభను కనబరిచి కర్నూలు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కేంద్రంలోని మోడీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈ మహాసభలో సామాన్య ప్రజలు, శ్రామిక, రైతు, ఉద్యోగ కార్మికులందరి కష్టాలను కళ్లకు కట్టినట్లు కళాకారులు తమ ప్రదర్శన ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ ఆలోచింపజేసే విధంగా ఉండాలని చెప్పారు. ఈ మహాసభలో ప్రతినిధులు చర్చించుకుని భవిష్యత్తు కర్తవ్యాలను నిర్ణయించుకొని పోరాటాలకు సిద్ధమవుతారన్నారు. ఈ మహాసభలను జయప్రదం చేసేందుకు లక్షలాదిగా ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు.



విశాఖకు వెళ్లే పిఎన్ఎం కళాకారులకు సెండాఫ్ ఇస్తున్న సిఐటియు నాయకులు

వెబ్ సైట్‌లో లాస్ట్ గ్రేడ్ సర్వీస్ అభ్యర్థుల జాబితా

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్, ఆంధ్ర ప్రదేశ్, విజయవాడ వారి ఆదేశాల ప్రకారం కర్నూలు , నంద్యాల జిల్లాలలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఖాళీగా ఉన్న లాస్ట్‌గ్రేడ్ సర్వీస్ (02 పోస్టులు) ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన రెండో ఫేస్ సెలెక్షన్ జాబితా , అభ్యర్థులకు సూచనలను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల జాబితా ను వెబ్ సైట్ లో పొందుపరిచామని ఇన్‌ఛార్జి డిఎంహెచ్ఒ డాక్టర్ ఎల్ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు.

31.12.2025 2025 ఈనెల 31 సాయంత్రం 05:00 గంటలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం కర్నూలులో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని కోరారు. వివరాల కొరకు కర్నూలు , నంద్యాల జిల్లా వెబ్ సైటు https:kurnool.ap.gov.in, https:nandyal.ap.gov.in లను సందర్శించగలరని తెలిపారు.

జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలి

నిరుద్యోగభృతి హామీ అమలకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు నిరుద్యోగులకి ఇచ్చిన హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్ జనవరి నెలలో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టర్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో భిక్షాటన చేసి అనంతరం గాంధీ విగ్రహం ముందు ఖాళీ ప్లేట్లతో నిరసన తెలిపారు. ఎఐవైఎఫ్ నగర కార్యదర్శి భీసన్న అధ్యక్షత వహించారు. ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులులు మాట్లాడుతూ 2024 ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు వైసిపి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేసిందని, వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో 2 లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, మన ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటి భర్తీకి ప్రతి సంవత్సరం జనవరి నెలలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నోటిఫికేషన్ విడుదలకు ఆలస్యమైతే ప్రతినెల రూ.3000 నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగుల ఓట్లతో గద్దెనెక్కిన చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టి 18 నెలలు గడుస్తున్నా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడమే కాకుండా, నిరుద్యోగ భృతి హామీని గాలికి వదిలేసారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రంలోని యువత పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న మరో నాలుగు రోజుల్లో రాబోతున్న జనవరి 1వ తేదీ అయినా జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. అలాకాకుండా కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల నిర్లక్ష్యం వ్యవహరించి కేవలం ప్రవేట్ కంపెనీల ఎంఇఒలకు పరిమితమై పేపర్లలో ఉద్యోగాలు చూపించి నిరుద్యోగులను మోసం చేస్తే మాత్రం ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగులను కూడగట్టి కూటమి ప్రభుత్వా నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామన్నారు. అవసరమైతే సీఎం క్యాంప్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎఐవైఎఫ్ నగర అధ్యక్షులు నాగరాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, నగర అధ్యక్ష కార్యదర్శులు అభి, అశోక్ ఎఐవైఎఫ్ నగర నాయకులు నాయకులు చంటి, కృష్ణ, శ్రీకాంత్, హుస్సేన్, రాజ్‌కుమార్, ప్రభాకర్, రసూల్, నరేష్, సుల్తాన్, రాజేంద్ర పాల్గొన్నారు.



ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట యువకుల బిక్షాటన




కోడుమూరు మండలం గోరంట్లలో తనిఖీ చేస్తున్న స్పెషల్ ఆఫీసర్

సర్వేలు త్వరగా పూర్తి చేయాలి

గోరంట్ల సచివాలయాన్ని సందర్శించిన సివిల్ సప్లయ్ ఆఫీసర్ వెంకట రాముడు

కోడుమూరు మండల పరిధిలోని గోరంట్ల గ్రామ సచివాలయాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ డిస్టిక్ మేనేజర్ సివిల్ సప్లయ్ ఆఫీసర్ వెంకటరాముడు ఆకస్మికంగా తనకి చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరును సమీక్షించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, స్పందన రిజిస్టరు, మూమెంట్ రిజిస్టర్ను తనిఖీ చేశారు. ఎంపిడిఒ ఏసి రాముడితో కలిసి మండలంలోని గోరంట్ల గ్రామపంచాయతీలో సచివాలయంలో అసంపూర్తిగా ఉన్నటువంటి సర్వేలు త్వరగా పూర్తి చేయాలని పబ్లిక్ పర్సెప్షన్ సానుకూలంగా ఉండేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్టర్ చెక్ చేస్తూ బయోమెట్రిక్ రోజుకు రెండుసార్లు తప్పనిసరిగా మార్క్ చేయాలని ఆదేశించారు. అదే విధంగా గోరంట్ల లేఅవుట్లో ఇల్లు కట్టుకున్న లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడి ఇల్లు కట్టుకోవాలన్నారు. ఇల్లు కట్టుకోని పక్షంలో రద్దు చేయబడతాయని కాలనీలో ఇళ్ల నిర్మాణానికి త్వరగా బిల్లులు కూడా చెల్లింపులు చేస్తామని లబ్ధిదారులతో మాట్లాడారు. సమీపంలో ఉన్నటువంటి ఎస్సీ కాలనీ స్కూల్లో సందర్శించి అక్కడ టీచర్స్ తోను పిల్లలతోనూ సమీక్షలు చేయిస్తూ పిల్లలకు మధ్యాహ్న భోజనం విధానం పైన పిల్లలకు చదువు విషయం పైన డ్రాపవుట్స్ పైన సమాచారం అడిగి తెలుసుకున్నారు.



ఎరువుల, మందుల దుకాణాలపై ఎడిఎ దాడులు

ప్రజాశక్తి-సి బెళగల్

ఎరువుల, మందుల దుకాణాలపై ఎమ్మిగనూరు వ్యవసాయ సంచాలకులు ఎడిఎ ఎస్ఎండి ఖాద్రి శనివారం ఎఒ మల్లేష్ కుమార్ అధ్యక్షతన దాడులు చేశారు. మన గ్రోమోర్, మన అగ్రిస్టోర్, శివసాయి, నాగసాయి, మురళిసాయి, శ్రీమంజునాథ, మన అన్నపూర్ణ దుకాణాలలో తనిఖీలు చేపట్టి పలు రికార్డులను పరిశీలన చేశారు. స్టాక్ బోర్డులలో ఏరోజుకారోజు స్టాకు వివరాలను కనపరచాలన్నారు. రైతులకు కొనుగోళ్ళపై బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని, ఎవరైనా అక్రమంగా ఎరువులు, మందులు నిల్వలు చేస్తే, లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు.



రాష్ట్రస్థాయి క్రీడా పోటీల గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బీవీ


క్రీడలతో నాయకత్వ లక్షణాలు : ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆరోగ్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం శ్రీనీలకంఠేశ్వరస్వామి జాతర సందర్భంగా కీర్తిశేషులు, మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించే క్రీడా పోటీల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతర వంటి సందర్భాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం... సాంస్కృతిక, సామాజిక ఐక్యతకు దోహదపడుతుందని తెలిపారు. తన తండ్రి బీవీ.మోహన్ రెడ్డిని స్మరించుకుంటూ, వారి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఈ పోటీలు యువ క్రీడాకారులకు మంచి వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. క్రీడా నిర్వాహకులు, టిడిపి మండల కన్వీనర్ కెజి.వెంకటేష్, కోఆపరేటివ్ స్టోర్ ఛైర్మన్ అల్తాఫ్, పట్టణ నాయకులు బండే నవాజ్ పాల్గొన్నారు.

ప్రజల భావోద్వేగాలతో ఆడుకోవద్దు

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

ఆదోని మండలాన్ని కూటమి ప్రభుత్వం అశాస్త్రీయంగా రెండు మండలాలుగా విభజించి ప్రజల భావోద్వేగాలతో ఆడుకోవద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు విమర్శించారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గెజిట్ విడుదల చేసిన 17 గ్రామాల్లో 9 గ్రామాల పెద్దహరివాణం మండల కేంద్రానికి దూరంగా ఉన్నాయని, ఈ గ్రామాలను ఆ మండలంలో కలపకుండా నిలుపుదల చేయాలని, అనుకూలంగా ఉన్న గ్రామాలను కలపాలని కోరారు. రెవెన్యూ అధికారులు, కూటమి ప్రభుత్వం దీన్ని పరిశీలించి తక్షణమే దీనికి ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బి.వీరారెడ్డి, ఎం.ఉరుకుందు, మండల కమిటీ సభ్యులు బాష, మదిరే శాఖ కార్యదర్శి శ్రీనివాసులు, పార్టీ సభ్యులు నాగరాజు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డికి వినతి

ప్రజాశక్తి - మంత్రాలయం

104 సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డికి ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. మండలంలోని మాధవరం గ్రామంలోని శనివారం రాఘవేంద్రరెడ్డి స్వగృహంలో ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, కొండయ్య, రామయ్య, వీరేష్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో సేవలందిస్తూ ప్రజా సంజీవినిగా పేరు తెచ్చుకున్న 104 వాహనాల్లో పని చేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. చాలిచాలని వేతనాలతో ఉద్యోగులు పని చేస్తున్నారని చెప్పారు. అరబిందో కంపెనీ నుంచి రావాల్సిన బకాయిలు, గ్రాట్యుటీ డబ్బుల విషయంలో అన్యాయం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అరబిందో నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పించాలని కోరారు. ఉద్యోగ భద్రతను కల్పించి ఐదేళ్ళు పూర్తి చేసుకున్న డ్రైవర్ స్టాఫ్ ఆఫీసు చేయాలని, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు కనీస వేతనం రూ.18,500కు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రతి డివిజన్‌కూ ఒక బఫర్ సిబ్బందిని నియమించాలని, క్యాజువల్ లీవ్‌ను ఇవ్వాలని కోరారు.



రాఘవేంద్ర రెడ్డికి వినతి అందజేస్తున్న నాయకులు

42వ రోజూ 'జిల్లా' దీక్షలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలు శనివారం 42వ రోజుకు చేరుకున్నాయి. పట్టణంలోని భీమాస్ కూడలిలో జరుగుతున్న ఈ దీక్షలకు మాల మహానాడు నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి సంఘీభావం ప్రకటించారు. ఆదోని జిల్లా ప్రాముఖ్యతను, ఇక్కడి ప్రజల ఆకాంక్షను చాటి చెప్పేలా రూపొందించిన ప్రత్యేక గీతాన్ని నాయకులు ఆవిష్కరించారు. మాల మహానాడు నాయకులు, న్యాయవాది చంద్రయ్య మాట్లాడుతూ... దశాబ్దాల కాలంగా ఆదోని ప్రజలు జిల్లా కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి జిల్లాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భౌగోళికంగా అన్ని వనరులు ఉన్నా ఈ ప్రాంతాన్ని జిల్లాగా చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వంటావార్పుతో హోరెత్తిన భీమాస్ కూడలి

పట్టణంలో భీమాస్ కూడలిలో ఆదోని జిల్లా సాధన సమితి జెఎసి ఆధ్వర్యంలో వంటావార్పు నిర్వహించారు. రోడ్డుపైనే పొయ్యి పెట్టి వంట చేస్తూ వినూత్నంగా నిరసన చేపట్టారు. జెఎసి నాయకులు నూర్ అహ్మద్, రఘురామయ్య, లలిత, వీరేష్, కృష్ణమూర్తి గౌడ్, అశోక్ నందరెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి ఆదోని జిల్లా డిమాండ్‌ను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతం అభివృద్ధి జరగాలన్నా, ప్రజలకు పాలన చేరువ కావాలన్నా ఆదోనిని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరారు. జిల్లా సాధన కోసం ఇప్పటికే కార్యాచరణను సిద్ధం చేశామని, రానున్న రోజుల్లో ఆందోళనలు నిరంతరాయంగా కొనసాగుతాయని హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరి మారకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. జై ఆదోని.. జైజై ఆదోని అనే నినాదాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. రోడ్డుపైనే భోజనం వడ్డించి నిరసన తెలియజేశారు. నాయకులు ఉదయ్, తిరుమల, రమేష్, గోపాల రావు, రాజు ఉన్నారు.



దీక్షలో కూర్చున్న మాల మహానాడు నాయకులు



వంటావార్పు చేపడుతున్న నాయకులు



రోడ్డుపైనే భోజనం వడ్డిస్తున్న నాయకులు

ఆదోనిని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయకపోతే

తగిన గుణపాఠం తప్పదు

- విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల జెఎసి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పశ్చిమ ప్రాంతమైన ఆదోనిని జిల్లా కేంద్రంగా ప్రకటించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం అవలంభిస్తోందని, జిల్లాగా ప్రకటించకపోతే తగిన గుణపాఠం చెబుతామని నాయకులు హెచ్చరించారు. విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని శ్రీనివాస సర్కిల్‌లో వంటావార్పు చేపట్టారు. ఆదోని జిల్లా సాధన జెఎసి నాయకులు కమల గణేష్, శేఖర్ నాయుడు, బాలరాజ్, ఉదయ్, ప్రసాద్, సత్య నారాయణరెడ్డి, ఖాజా, ఆఫ్రిద్, కృష్ణ, రఘు, సత్యన్న, రాజు మాట్లాడారు. ఆదోని జిల్లా సాధనకు పట్టణంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 18 రోజులకు చేరాయని, కూటమి ప్రభుత్వం, అధికారులు స్పందించకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆదోని జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని, లేకపోతే త్వరలో 5 నియోజకవర్గాల ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని, రాబోయే స్థానిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. పరుశురాం, హనీఫ్, సందీప్, అనిల్, రఘురాం, ఎల్లప్ప, నాగరాజ్ పాల్గొన్నారు.




శ్రీనివాస సర్కిల్‌లో వంటావార్పు చేస్తున్న నాయకులు

ముగిసిన కబడ్డీ, క్రికెట్ పోటీలు

- బహుమతులు అందజేత

ప్రజాశక్తి - దేవనకొండ



విజేతకు బహుమతి అందిస్తున్న శ్రీరాములు

మండలంలోని తెర్నేకల్ గ్రామంలో క్రిస్మస్ సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ, జిల్లా స్థాయి టెన్నిస్ క్రికెట్ బాల్ పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు దాతలు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. కబడ్డీ మొదటి బహుమతి రూ.50,016 ప్యాపిలి జట్టుకు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి సోదరుడు శ్రీరాములు, రెండో బహుమతి రూ.35,016లను విజయవాడ కెఎల్ యూనివర్సిటీ సీనియర్స్ జట్టుకు వైసిపి రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేంద్ర రెడ్డి అందజేశారు. మూడో బహుమతి రూ.25,016లను గోనెగండ్ల జట్టుకు వైసిపి రాష్ట్ర బూత్ కమిటీ సయుక్త కార్యదర్శి కొత్తకాపు మధుసూదన్ రెడ్డి, నాలుగో బహుమతి రూ.15,016లను గుండ్లకొండ జట్టుకు కెడిసిసి మాజీ డైరెక్టర్ దాసరి లుముంబ, ఐదో బహుమతి రూ.10,016లను విజయవాడ కెఎల్ యూనివర్సిటీ జూనియర్స్ జట్టుకి తెర్నేకల్ సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్, ఆరో బహుమతి రూ.5,016లను తెర్నేకల్ జట్టుకు వైసిపి మండల క్రిస్టియన్ మైనార్టీ ప్రెసిడెంట్ పులి నరేష్ అందించారు. జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీల్లో మొదటి బహుమతి రూ.50,016లను ఎమ్మిగనూరు లెవెన్ జట్టుకు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యులు నరహరి నారాయణ రెడ్డి, రెండో బహుమతి రూ.30,016ను తెర్నేకల్ లిటిల్ స్టార్ జట్టుకు మాజీ సర్పంచి బాటమీది రాజన్న, మూడో బహుమతి రూ.15,016లను ఎమ్మిగనూరు జట్టుకు మాజీ ఉప సర్పంచి గిరిపోగు సత్యరాజు అందించారు. బహుమతుల ప్రదానానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న సిఐ వేణుగోపాల్‌ను సన్మానించారు.



విజేతగా నిలిచిన జట్టు



బహుమతులు అందజేస్తున్న మారెప్ప

ఆటలపోటీలతో స్నేహభావం

- సహకార సంఘం అధ్యక్షులు బోయ మారెప్ప

ప్రజాశక్తి - కౌతాళం

ఆటలపోటీల ద్వారా యువకుల మధ్య స్నేహభావం పెంపొందుతుందని బదినేహాల్ సహకార సంఘం అధ్యక్షులు బోయ మారెప్ప తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా కుంటనహల్ గ్రామంలో నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన జట్టుకు నగదుతో పాటు కప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. గెలుపోటములు సమానంగా తీసుకోవాలని కోరారు. టిడిపి నాయకులు మాణిక్ బాష పాల్గొన్నారు.

'ఉపాధి' చట్టాన్ని కాపాడాలి

- కొత్త బిల్లును వెనక్కి తీసుకోవాలి
- సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ప్రజాశక్తి - ఆలూరు

పేదల కోసం తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కోరారు. శనివారం సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆలూరులోని పాతబస్టాండ్ ఆవరణలో జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... జనవరి 18న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సావాలలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. సిపిఐ జిల్లా నాయకులు భూపేష్, మండల కార్యదర్శి రామాంజనేయులు, మండల సహాయ కార్యదర్శి ఎస్ఎస్.బాషా, ఎఐటియుసి తాలూకా కార్యదర్శి రంగన్న, రైతుసంఘం నాయకులు చంద్రకాంత్ రెడ్డి, చాపల గోపాల్, సిద్ధేశ్వర కాలనీ శాఖ కార్యదర్శి సిద్ధి లింగ, పెద్దహోతూరు శాఖ కార్యదర్శి రాముడు, పుల్లి, దళితుల హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు రంగన్న పాల్గొన్నారు.

సేవాగుణం అలవరచుకోవాలి

- లయన్స్ క్లబ్ ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్

ప్రజాశక్తి - ఆదోని

పేదలు, అభాగ్యులకు సహాయం చేస్తూ సేవాగుణం అలవాటు చేసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్ ఆకాంక్షించారు. రైల్వేస్టేషన్, ఆర్‌టిసి బస్టాండ్, రోడ్ల వెంట నిద్రిస్తున్న పేద వృద్ధులకు ఆదోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతేడాది చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దాదాపు 50 మందికి ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, విశిష్ట సభ్యులు నీలి మోహన్, ఓం ప్రకాష్, చాంద్ బాషా, గౌరీశంకర్ పాల్గొన్నారు.



పెద్దహరివాణంలో కలుపొద్దు

- 16 గ్రామాల ఆమరణ నిరాహార దీక్ష

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నుంచి తమ గ్రామాలను విడదీయవద్దంటూ 16 గ్రామాల ప్రజలు గళమెత్తారు. పెద్దహరివాణంలో విలీనం చేయరాదని కోరుతూ శనివారం పట్టణంలోని శ్రీనివాస భవన్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ముందు చేపట్టిన దీక్ష శిబిరం 6వ రోజుకు చేరింది. ఉద్యమాన్ని ఉధృతం చేసే దిశగా టిడిపి సీనియర్ నాయకులు చిన్నగోనెహాలు గోపాల్ రెడ్డి ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఆయన దీక్షకు మద్దతుగా గ్రామాల నుంచి భారీగా సంఘీభావం తెలిపేందుకు ఆదోనికి చేరుకున్నారు. ఆదోనిలోని దీక్ష శిబిరం నుంచి మున్సిపల్ రోడ్లపై భారీ ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ భవన్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గోపాల్ రెడ్డి నిరాహార దీక్ష చేపట్టారు. గతంలో ఈ గ్రామాలు ఆలూరు మండలంలో ఉన్నప్పుడు అభివృద్ధికి నోచుకోక అనేక ఇబ్బందులు పడ్డామని తెలిపారు. 2009 పునర్విభజనలో భాగంగా ఆదోని మండలంలో ప్రభుత్వం విలీనం చేసిందని చెప్పారు. ఇప్పుడిప్పుడే ప్రగతి పథంలో నడుస్తున్న తమ గ్రామాలను పెద్దహరివాణంలో భాగం చేయడం ఒప్పుకోమన్నారు. ఒక నాయకుని స్వార్ధ ప్రయోజనాల కోసం తమ గ్రామాలను విభజించడం సరైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాలు ఆదోని మండలంలోనే ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయ నాయకులు ప్రజల భావోద్వేగాలను పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ఈ 16 గ్రామాలను ఆదోని మండలంలోనే కొనసాగిస్తామని ప్రకటించకపోతే, రహదారులపైనే వంటావార్పు నిర్వహిస్తామని హెచ్చరించారు. అవసరమైతే ప్రభుత్వ కార్యాలయాలను స్తంభింపజేసి కార్యకలాపాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. నాయకులు రామస్వామి రాముడు, షేక్షావలీ, నారాయణ, కారుమంచప్ప, మధు, వెంకటేష్ చౌదరి, మల్లికార్జున, శేషప్ప, మల్లికార్జున, రమేష్, సర్పంచి రామకృష్ణారెడ్డి, నాయకులు ప్రసాద్, సుజ్ఞానమ్మ పాల్గొన్నారు.



ఆమరణ నిరాహార దీక్షలో మాట్లాడుతున్న గోపాల్ రెడ్డి



దీక్ష శిబిరానికి మద్దతుగా రోడ్డు దిగ్బంధనం చేసిన గ్రామాల ప్రజలు



శ్యామలా దేవి ఆశీస్సులు తీసుకుంటున్న గోపీ

ప్రభాస్‌పై అభిమానం...

- ప్రభాస్ పెద్దమ్మ ఆశీస్సులు తీసుకున్న గోపీ

ప్రజాశక్తి - ఆదోని

పట్టణానికి చెందిన ప్రభాస్ వీరాభిమాని గోపీ తన అభిమాన నటుడి కుటుంబంపై ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న ప్రభాస్, త్వరలో 'రాజా సాబ్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రం ప్రీరిలీజ్ హంగామా మొదలైన తరుణంలో ఆదోనికి చెందిన గోపీ శనివారం మాట్లాడారు. హైదరాబాద్‌లోని కీర్తిశేషులు కృష్ణంరాజు నివాసానికి వెళ్లానని, అక్కడ కృష్ణంరాజు సతీమణి శ్యామలా దేవిని మర్యాదపూర్వకంగా కలిశానని తెలిపారు. ఆమెను శాలువాతో సన్మానించి, ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ప్రభాస్ పట్ల తనకున్న అభిమానాన్ని వివరిస్తూ, గతంలో తాను చేసిన సేవా కార్యక్రమాలు ప్రభాస్ ఫొటోలతో కూడిన ప్రత్యేక ఆల్బమ్‌ను ఆమెకు చూపించారు. గోపీ అంకితభావాన్ని శ్యామలా దేవి అభినందించారు. ప్రభాస్ తమకు కేవలం నటుడు మాత్రమే కాదని, ఒక స్ఫూర్తి అని, వారి కుటుంబ సభ్యులను కలవడం చాలా ఆనందంగా ఉందని గోపీ తెలిపారు.

వందరోజుల ప్రణాళిక అమలు చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పదో తరగతి విద్యార్థుల కోసం వంద రోజుల ప్రణాళికను కట్టుదిట్టంగా అమలు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఉర్దూ బాలికల పాఠశాలకు స్పెషల్ ఆఫీసర్‌గా ఉన్నందున పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం పంపిణీని తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ... వంద రోజుల ప్రిపరేషన్ ప్లాన్ గురించి వివరించారు. ఎంఇఒ మధుసూదన్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు జిల్లా సాధనకు రాస్తారోకో

- స్తంభించిన గోనెగండ్ల - భారీగా నిలిచిపోయిన వాహనాలు
- పోలీసులతో వాగ్వాదం - త్వరలో కార్యాచరణ ప్రకటన : జెఎసి

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఎమ్మిగనూరును జిల్లాగా ప్రకటించాలని కోరుతూ ఎమ్మిగనూరు జిల్లా సాధన సమితి జెఎసి ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో చేపట్టారు. గోనెగండ్ల ప్రధాన రహదారి స్తంభించింది. కర్నూలు, ఎమ్మిగనూరు ప్రధాన రహదారిపై వందలాదిగా వాహనాలు నిలిచిపోయి కొద్దిసేపు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రాజేష్, రంగయ్య, చిన్ని ప్రసాద్, పరమేష్, ఛార్లెస్ మాట్లాడారు. ఎమ్మిగనూరు జిల్లా ప్రకటన చేయాలని, ఆదోని నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షిస్తూ చేస్తున్న ఉద్యమానికి ఊపిరిగా ఉంటామని తెలిపారు. ఎమ్మిగనూరు నియోజకవర్గ ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపడం సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా సహించబోమని, త్వరలో అన్ని నియోజకవర్గాల్లో నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఆదోని జిల్లా ప్రకటన చేసినా అడ్మినిస్ట్రేషన్ కార్యాలయాలన్నీ ఎమ్మిగనూరు పరిధిలో ఉండాలని డిమాండ్ చేశారు. త్వరలోనే జెఎసి ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. బనవాసి ఫారం ప్రాంతంలో ఇప్పటికే నిర్మితమైన పాత క్వార్టర్స్ ఉన్నాయని, వాటిని మోడలింగ్ చేస్తే చాలని చెప్పారు. ప్రభుత్వం ఖర్చు కూడా తగ్గుతుందని తెలిపారు. జెఎసి నాయకులు లక్ష్మణ్, శ్రీను, నరసింహా, తిమ్మప్ప, రాము, నాని, నరసింహా, ముని, రంగస్వామి పాల్గొన్నారు.



పోలీసులతో వాగ్వాదానికి దిగిన నాయకులు



రాస్తారోకో నిర్వహిస్తున్న జెఎసి నాయకులు



కృష్ణమ్మను సన్మానిస్తున్న నాయకులు

కృష్ణమ్మను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - దేవనకొండ

టిడిపి జిల్లా అధ్యక్షులుగా ఎంపికైన గుడిసె ఆది కృష్ణమ్మను టిడిపి మండల నాయకులు బడిగింజల రంగన్న, కప్పట్రాళ్ల మల్లికార్జున, ఈదుల దేవరబండ సుభాన్, వెంకట స్వామి గౌడ్, ఆకుల వీరేష్, వెలమకూర్ సర్పంచి భాస్కర్ శనివారం కలిసి పూలమాలలతో సన్మానించారు. నాయకులు రాముడు, నాగేశ్వరరావు, రాజా సాహెబ్, మస్తాన్, వీరేష్, టీవీ రామాంజిని, పరమేష్, చాందు, నాగ భూషణం, విష్ణువర్ధన్ రెడ్డి, ఖాసీం, వీరకృష్ణ పాల్గొన్నారు.

ఉల్లిగయ్యకు ఘన సన్మానం

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ఉలిగయ్యను శనివారం టిడిపి కుంభాలనూర్ నాయకులు మహాదేవ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టిడిపి ఆవిర్భావం నుంచి క్రమశిక్షణతో.. కార్యకర్తలకు అండగా ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ఉల్లిగయ్యకు జిల్లా ఉపాధ్యక్ష పదవి ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. కష్టపడి పని చేసే నాయకులకు పార్టీ గుర్తింపు ఇస్తుందనదానికి ఇదే నిదర్శనమన్నారు. ఉల్లిగయ్య మరిన్నీ ఉన్నత పదవులు అందుకోవాలని ఆకాంక్షించారు. డీలర్ ఈరన్న, మాల ఈరేష్, మారేష్, ఎల్లప్ప, ఈరన్న, ముత్తన్న, ఈరేషా, సిద్ధ పాల్గొన్నారు.



ఉల్లిగయ్యను సన్మానిస్తున్న నాయకులు

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

- జనసేన ఇన్‌ఛార్జీ వెంకప్ప

ప్రజాశక్తి - ఆస్పరి

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ వెంకప్ప తెలిపారు. శనివారం మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో పాటు మధ్యాహ్న భోజనం చేసి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి మాట్లాడుతూ... పాఠశాలకు సరిపడ తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సిబ్బంది కొరత ఉందని, పాఠశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో పశువులు, మందుబాబులు వచ్చి వెళ్తుంటారని తెలిపారు. ప్రహరీ ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని వెంకప్ప దృష్టికి తెచ్చారు. వెంకప్ప స్పందిస్తూ... ఈ సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ వెంకటేశ్వర్లు వెంకప్పకు శాలువా, పూలమాల వేసి సన్మానించారు. ఎపి కురువ కార్పొరేషన్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, జనసేన మండల కన్వీనర్ అరవింద్ కుమార్, నాయకులు శ్రీనివాసులు, బద్రి, అంజి, గోవర్ధన్, రాజశేఖర్, రామకృష్ణ, బ్రహ్మ, వినోద్, జయరాం, అరవింద్, మంజునాథ్, దేవా పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం : మండలంలోని కైరుప్పల గ్రామానికి చెందిన కిడ్నీ బాధితుడు మహానందికి వెంకప్ప ఆర్థిక సహాయం అందజేసి, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కిడ్నీ బాధితులకు పెన్షన్ పెంచినట్లు తెలిపారు. ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేసిందన్నారు.



సమస్యలను వెంకప్పకు వివరిస్తున్న ప్రధానోపాధ్యాయులు



ఆర్థిక సాయం అంద జేస్తున్న వెంకప్ప



అధికారులను నిలదీస్తున్న స్థానికులు

రేషన్ కోసం పాట్లు

- రెండు కిలోమీటర్ల పరుగులా..? - అధికారులను నిలదీసిన స్థానికులు

ప్రజాశక్తి - ఆదోని

రేషన్ కోసం పాట్లు పడుతున్నామని పట్టణంలోని రెండో వార్డు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బావాజీ పేటలో రేషన్ కార్డు దారులు నిరసన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న డిప్యూటీ తహశీల్దార్ రుద్రగౌడ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. పట్టణంలోని రెండో వార్డు బావాజీపేట ప్రజలు రేషన్ సరుకుల కోసం పడుతున్న ఇబ్బందులపై రెవెన్యూ అధికారులు వివరాలు సేకరించారు. టిడిపి పట్టణ అధ్యక్షులు తిమ్మప్ప నేతృత్వంలో సివిల్ సప్లయి డిప్యూటీ తహశీల్దార్ రుద్ర గౌడ్ వార్డులో పర్యటించి స్థానిక మహిళలతో మాట్లాడారు. తమ వార్డుకు చెందాల్సిన రేషన్ షాపును సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రశాంత్ నగర్‌లో ఏర్పాటు చేయడంపై మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి సరుకులు తెచ్చుకోవడం తమకు ఆర్థిక భారంగా మారిందని, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తెచ్చారు. బావాజీపేటలోనే రేషన్ పంపిణీ జరిగేలా చూడాలని వారు కోరారు. దీనిపై డిప్యూటీ తహశీల్దార్ స్పందిస్తూ... క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను స్వయంగా పరిశీలించానని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్డుదారులకు, స్థానికులకు హామీ ఇచ్చారు.

జాతీయ స్థాయిలో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - మంత్రాలయం


జాతీయ స్థాయి క్రీడల్లో మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.రాధమ్మ ప్రతిభ కనబరిచి 3వ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించినట్లు, మంత్రాలయం పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చినట్లు పాఠశాల ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు విఠోభరావు తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో పాఠశాల బృందం విద్యార్థిని రాధమ్మను అభినందించారు. ఈ సందర్భంగా విఠోభరావు మాట్లాడారు. ఈనెల 16 నుంచి 24వ తేదీ వరకు రాజస్థాన్‌లోని జోద్‌పూర్‌లో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయస్థాయి అండర్-19 సెపక్ తక్రా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. తమ పాఠశాల నుంచి రాధమ్మ ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొని పంజాబ్, మహారాష్ట్ర, నాగాలాండ్, కేరళ, మణిపూర్ రాష్ట్రాలపై గెలిచి కాంస్య పతకం సాధించినట్లు ఆనందం వ్యక్తం చేశారు. క్రీడల్లో విద్యార్థినిని ప్రోత్సహించిన వ్యాయామ ఉపాధ్యాయులు రవీంద్ర, నరసింహ రాజు కృషి ప్రశంసనీయమని కొనియాడారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వీరేష్ రావు, ఉమామహేశ్వరి, అనురాధ, శివశంకర్, రామచంద్ర, రవీంద్ర, నరసింహ రాజు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న సిబ్బంది

ఎమ్మెల్యే విరుపాక్షికి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - ఆస్పరి


ఎమ్మెల్యే విరుపాక్షిని పరామర్శిస్తున్న నాయకులు

మోకాళ్లకు శస్త్ర చికిత్స చేయించుకున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షిని మండలంలోని ములుగుందం గ్రామానికి చెందిన సొసైటీ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచి చిన్నయప్ప శనివారం హైదరాబాదులోని నివాసంలో పరామర్శించారు. ఎమ్మెల్యే ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకొని ప్రజలకు అందుబాటులోకి రావాలని ఆకాంక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలోపేతంపై అడిగి తెలుసుకున్నారన్నారు. గ్రామాల్లో పార్టీ పటిష్టతకు ప్రతి నాయకుడు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. వైసిపి ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఎల్లప్ప, నాయకులు కన్న, రాముడు ఉన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

- ఎడిఎ చెంగల్ రాయుడు


మాట్లాడుతున్న ఎడిఎ చెంగల్ రాయుడు

ప్రజాశక్తి -ఆలూరు

రైతులు పండించే పంటల్లో పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు పొందవచ్చని ఆలూరు ఎడిఎ చెంగల్ రాయుడు తెలిపారు. శనివారం ఆలూరు రైతు సేవా కేంద్రంలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులు, శాస్త్రవేత్తల ముఖాముఖి చర్చాగోష్టి చెంగల్ రాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా కెవికె శాస్త్రవేత్త నిరంజన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే పద్ధతులు పాటించాలని, చిరు ధాన్యాలు పండించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. వివిధ పంటలపై సస్యరక్షణ చర్యలను శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకొని పాటించాలన్నారు. మట్టి నమూనాలు సేకరించి ఎరువులు ఎంత మోతాదులో వేయాలి, ఏ పంట వేసుకోవాలో తెలుసుకోవాలని అన్నారు. ఎఒలు వెంకటేష్ గౌడ్, జిలాని బాష, ఆనంద్ లోకదల్, ఎన్ఎఫ్ఎంటి రేవన్న, ఆత్మ అసిస్టెంట్ డైరెక్టర్ మేనేజర్ మధు మోహన్, రైతులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు శక్తి టీమ్

- ఎస్ఐ విద్యశ్రీ


మాట్లాడుతున్న ఎస్ఐ విద్యశ్రీ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శక్తి టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు పెద్దతుంబలం ఎస్ఐ విద్యశ్రీ తెలిపారు. శనివారం పెద్దతుంబళం గ్రామంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు ఎస్ఐ విద్యశ్రీ అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎక్కడైనా మహిళలు ఒంటరిగా ఉండి ఇతరులతో ఇబ్బందులు పడే పరిస్థితులు తలెత్తినప్పుడు శక్తిటీమ్‌కు సమాచారం అందించాలన్నారు. 15 నిమిషాల్లో అక్కడకు చేరి రక్షిస్తారని చెప్పారు. మహిళలందరూ శక్తి టీమ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. శక్తి టీమ్‌లో ఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉంటారన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణ దారులకు నోటీసులు

ప్రజాశక్తి-కోడుమూరు

కోడుమూరు గ్రంథాలయ సంస్థ స్థలంలో అక్రమ నిర్మాణం పనులపై ఎట్టకేలకు గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. కోడుమూరు గ్రామ అభివృద్ధి కమిటీ, ప్రజల ఫిర్యాదు మేరకు కోడుమూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. గ్రంథాలయ సంస్థ స్థలంలో అక్రమ నిర్మాణం పనులను చేపడుతున్న సుభాన్ అనే వ్యక్తికి నోటీసు జారీ చేశారు. గ్రామ పంచాయతీ నుండి ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టకూడదంటూ కోడుమూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి నోటీసులలో పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం గ్రామ పంచాయతీ తరుపున ఉత్తర్వులు జారీ చేశారు.

వడ్డే తులసి కుమార్‌కు జిల్లా బహిష్కరణ

-ఇప్పటివరకు ముగ్గురు జిల్లా బహిష్కరణ- కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి ఆదేశం - ఎస్‌పి విక్రాంత్ పాటిల్ వెల్లడి



ప్రజాశక్తి -కర్నూలు క్రైమ్

కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని షరీన్ నగర్లో నివాసముండే వడ్డే రామాంజనేయులు పెద్ద కుమారుడు వడ్డే తులసి కుమార్ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అలవాటు పడిన ఆయనకు కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి జిల్లా బహిష్కరణ ఉత్తర్వులను జారీ చేశారు. కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వడ్డే తులసి కుమార్ పై రౌడీషీట్ నెంబర్ 389 ఉంది. ఆయన 5 క్రిమినల్ కేసులలో నిందితుడుగా ఉన్నాడు. అందులో హత్యలు, దోపిడీలు, ఎస్సీ ఎస్టీ వర్గాల మీద దాడులు, జులుం కేసులు, హత్యాయత్నం కేసులు , ఇలా పలు రకాల కేసులు ఈయన పై నమోదయి ఉన్నాయి. పై తెలిపిన కేసుల్లో పలు మార్లు రిమాండ్‌కు వెళ్లి ఖైదు చేయబడినప్పటికీ కూడా ఆయన ప్రవర్తనలో ఎటువంటిమార్పు రాకపోగా, తదుపరి రకరకాల కేసులలో పాల్గొంటున్నాడని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రతిపాదనల మేరకు ఇతని క్రిమినల్ రికార్డులను నిశితంగా పరిశీలించిన మీదట జిల్లా కలెక్టర్ ఇతని మీద జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ... జిల్లాలో ఇప్పటివరకు చెడు నడత కలిగిన ముగ్గురిపై వడ్డే రామాంజనేయులు, పటాన్ ఇమ్రాన్ ఖాన్, వడ్డే తులసి కుమార్‌లకు జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. జిల్లాలో ఇప్పటినుండి ఎవరైనా రౌడీయిజంతో అరాచక శక్తులుగా మారి , ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలగజేసే విధంగా ప్రవర్తిస్తే అటువంటి వారిపై జిల్లా బహిష్కరణతో పాటు గా పీడి యాక్ట్ నమోదు చేసి జైలుకు తరలిస్తామన్నారు. ప్రశాంతంగా, మంచిగా, బుద్ధిగా జీవించాలని ఎస్‌పి కోరారు. ఇటువంటి చెడు నడత కలిగిన చాలామంది పేర్లు జిల్లా బహిష్కరణ పరిశీలనలో ఉన్నాయని, మంచి ప్రవర్తనతో జీవించాలని పాటిల్ సూచించారు.

ఘనంగా కాటసాని జన్మదిన వేడుకలు

- పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకాంక్షలు


అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పాణ్యం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు తన స్వగృహంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గంలోని వైసిపి అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కాటసాని రాంభూపాల్ రెడ్డి చేత తన నివాసంలో కేక్ కట్ చేయించి గజమాలలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. వైసిపి అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు, కల్లూరు 16 వార్డుల నాయకులు, కల్లూరు, ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం మండలాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

కల్లూరు అర్బన్ లో: 33వ వార్డు కల్లూరు ఇందిరమ్మ కట్ట వద్ద ఘనంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు స్థానిక కార్పొరేటర్ నరసింహులు కాటసాని నివాసం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మైనారిటీ సెల్ జిల్లా సెక్రటరీ ఎస్ఎం బాషా ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి కాటసాని రాంభూపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం నాయకులు శ్రీధర్ రెడ్డి ఆయన సతీమణి,డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక నిర్వహించారు. కర్నూలు నగరంలో... జోహారాపురం రోడ్డు అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదానం పెద్దపాడు శ్రీధర్ రెడ్డి ఆయన సతీమణి డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక నిర్వహించారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ ముఖ్య అతిథులుగా హాజరై అన్నదానం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం, యాగంటి ఉమామహేశ్వర స్వామిఆలయం, శ్రీ కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం నుండి వచ్చిన వేద పండితులు వేదమంత్రాలు చదివి కాటసాని దంపతులను ఆశీర్వదించారు. చెన్నమ్మ సర్కిల్ లో కాటసాని రాంభూపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను వాణిజ్య విభాగం అధ్యక్షులు మిద్దూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో 32, 33, 35 వార్డు నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కల్లూరు 19వ వార్డులో బెల్లం మహేశ్వరిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు కేక్ కట్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు


కాటసాని రాంభూపాల్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కాటసానికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ సుధాకర్

క్రోడుమూరు : వైసిపి నంద్యాల జిల్లా జిల్లా అధ్యక్షులు, పాణ్యం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాటాసాని రాంభూపాల్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా శనివారం కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల జీవించాలని ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. చాలారోజులకు బయటకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్‌ను కాటసాని అభినందించారు.



ఐక్యతను పెంపొందించేది కబడ్డీ

-ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



-కబడ్డీ ఆడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

క్రీడాకారులు జట్టు భావనను, ఐక్యతను పెంపొందించే క్రీడ కబడ్డీ అని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. క్రిస్టమస్ పర్వదినాన్ని పురస్కరించుకొని కర్నూలు మండలం, పంచలింగాల గ్రామంలో ఎబిఎం చర్చ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ ప్రాంగణం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు పార్లమెంట్ ఎంపి బస్తిపాటి నాగరాజు, కొడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే స్వయంగా కబడ్డీ పోటీలో పాల్గొని యువతతో కలసి ఆటలో భాగమయ్యారు. ప్రజాప్రతినిధులు అయినటువంటి ముఖ్యంగా ఎంపీ నాగరాజు పంచలింగాల వాస్తవ్యుడు కావడం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆ గ్రామానికి అల్లుడవడం వీరిరువురు మైదానంలోకి దిగడం పట్ల యువతలో అపూర్వమైన ఉత్సాహాన్ని కలిగించింది. క్రీడల పట్ల ఆసక్తిని మరింత పెంచింది. కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు. యువత క్రీడల్లో పాల్గొని ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చర్చ్ నిర్వాహకులు, క్రీడాకారులు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఎంపీకి, ఎమ్మెల్యేకు చర్చ్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి పథకం నిర్వీర్యానికి బిజెపి కుట్ర

ప్రజాశక్తి-సి బెళగల్



ఉపాధి హామీ చట్టం జాతిపిత మహాత్మగాంధీ పేర ఉండటం సహించని బిజెపి పేరు మార్పు చేస్తూ నిర్వీర్యానికి కుట్ర చేస్తుందని, ఈనిర్ణయాన్ని వ్యతిరేకించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గం కార్యదర్శి శేషుకుమార్ ఉపాధి కూలీలకు పిలుపునిచ్చారు. శనివారం పోలకల్ సచివాలయం వద్ద కూలీలతో వెళ్లి గూడూరు, కోడుమూరు పట్టణ కార్యదర్శులు శ్రీనివాసులు, రామాంజినేయులు సమక్షంలో పెద్ద ఎత్తున అందోళన చేపట్టారు. ఇక్కడే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం వలసల నివారణకు, నిరుపేదలకు వరంగా అమలులోకి వచ్చిందన్నారు. గత ప్రభుత్వాలు ఏటా రూ.4 కోట్ల 165 లక్షలు మంజూరు చేసేవని ప్రస్తుతం రాష్ట్ర వాటా కేంద్ర వాటా 50 శాతానికి తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. దొరలకు , పెత్తం దారులకు బానిస బతుకు కాకుండా ఉపాధి పనులు సామాన్యులకు, కూలీలకు స్వేచ్ఛనిచ్చిందని మింగుడు పడక కుట్ర చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం నోరుమెదపక పోవడం నిస్సిగ్గుగా ఉందని వాపోయారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.

పతకాలతో తిరిగి రండి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

క్రీడాకారులు అప్రమత్తంగా ఉండి పథకాలతో తిరిగి రావాలని ఇన్‌చార్జ్ విసి ఆచార్య వి.వెంకట్ బసవరావు ఆదేశించారు. శనివారం క్లస్టర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ మహిళా క్రీడాకారిణులకు కిట్లు వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు పంపిణీ చేశారు. ఫుట్‌బాల్ మెలకువలు నేర్చుకుంటే అద్భుతంగా రాణించవచ్చున్నారు. ఫిఫా వరల్డ్‌కప్ మ్యాచ్‌లు పరిశీలిస్తే భారత్ ప్రాతినిధ్యం సాధ్యమని చెప్పారు. రోనాల్డో, మెస్సీ వంటి ప్రముఖులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలోరిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్ ,స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ వై.శ్రీనివాస్ రెడ్డి, కెప్టెన్ ఎం. రేణుక, మేనేజర్ ఎ.అంజలి, కోచ్ కె.బ్రహ్మకుమారి ఉన్నారు.

నేడు మడకశిరలో యుటిఎఫ్ జిల్లా మహాసభలు

ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-మడకశిర రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) 4వ జిల్లా మహాసభలు ఆదివారం మడకశిరలో జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆ సంఘం నాయకులు ఇప్పటికే పూర్తి చేశారు. పట్టణంలోని ప్రధాన రహదారుల్లో యుటిఎఫ్ జెండాలు, తోరణాలతో అలంకరించారు. మడకశిర ఆర్అండ్‌బి అతిథి గృహంలో మహాసభలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

మడకశిర పట్టణంలో ఆదివారం జరిగే యుటిఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా గౌరవ అధ్యక్షులు కె.భూతన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శి డి.నరసింహప్ప, సహాధ్యక్షులు బాబు కోరారు. యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యలు, ప్రభుత్వ విద్యారంగ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. సామాజిక దృక్పథంతో సమాజ సేవలోనూ సేవలు అందిస్తోందన్నారు. యుటిఎఫ్ మహాసభల్లో విద్యారంగ సమస్యల పరిష్కారంపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణపై దిశా నిర్దేశం చేయనున్నట్లు చెప్పారు. యుటిఎఫ్ మడకశిర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివిఎన్.మాలింగప్ప, వై.జోగప్ప పాల్గొన్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల కోలాహలం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో కొలువైన రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో శ్రీమఠంలో కోలాహలం నెలకొంది. కర్ణాటక రాష్ట్రంలో వరుసగా సెలవులు రావడం, శనివారం స్వామి వారి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులిచ్చారు. తుంగభద్ర నదిలో స్నానాలు చేసిన భక్తులు కల్పవృక్ష షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్ ద్వారా, ప్రధాన ఆర్చి నుంచి క్యూలైన్ ఏర్పాటు ద్వారా శ్రీమఠంలో ప్రవేశించిన భక్తులకు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, ధార్మిక అధికారి శ్రీపతి ఆచార్, అసిస్టెంట్ మేనేజర్ ఐపి.నరసింహ మూర్తి సేవలు చేయించిన భక్తులకు విఐపి దర్శనం ఏర్పాటు చేశారు. శ్రీమఠం ఆధ్వర్యంలో సెక్యూరిటీ సిబ్బంది ద్వారా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా దర్శన అవకాశం కల్పించారు. దర్శన అనంతరం విఐపి భోజన శాల, అన్నపూర్ణ భోజనశాలలో భక్తులకు ఉచిత ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.


ఆలయ ప్రాంగణంలో ఉన్న భక్తులు

ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు తప్పని అవస్థలు

మంత్రాలయంలో ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు అవస్థలు తప్పడం లేదు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వస్తున్న సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. శనివారం కూడా స్వామి దర్శనార్థమై బస్సుల్లోనే కాకుండా ప్రయివేట్ వాహనాల్లోనూ, సొంత వాహనాల ద్వారా భక్తులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. వాహనాల పార్కింగ్ వల్ల శ్రీమఠం ఆవరణంలోని పార్కింగ్ స్థలాలు పూర్తిగా నిండిపోవడంతో దారులే వాహన పార్కింగ్‌లుగా మారాయి. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ఆర్‌టిసి, ప్రయివేట్ బస్సుల రాకపోకలతో పాటు సొంత వాహనాలతో రోడ్లన్నీ కిక్కిరిసి పోయాయి. సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బందితో కలిసి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా వెళ్తున్న వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూసేందుకు ట్రాఫిక్ నియంత్రణలో తలమునకలయ్యారు. ఒక్కసారిగా మూడు వైపుల నుంచి వస్తున్న వాహనాలను కూడలి మధ్యలో ఉంటూ ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. సిఐ, ఎస్ఐలు రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలను తొలగించాలని సూచించి సహకరించాలని కోరారు.



హైస్కూలులో డిఇఒ ఆకస్మిక తనిఖీ



ప్రజాశక్తి-కోడుమూరు

కోడుమూరు జివిఆర్ జిల్లా పరిషత్ హైస్కూల్ లో డిఇఒ ఎల్.సుధాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. 100 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా శనివారం పదోతరగతి విద్యార్థులకు హిందీ స్లిప్‌టెస్ట్-3 పరిశీలించి విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. పదో తరగతి విద్యార్థులు 125 లకు గాను 82 మంది విద్యార్థులు హాజరుకావటాన్ని ప్రధానోపాధ్యాయుడిని వివరణ అడిగి తెలుసుకున్నారు. హాజరు శాతం పెరిగే టట్లు చూడాలని ఆదేశించారు. ఇందులో భాగంగా విద్యార్థులు క్రమంగా పాఠశాలకు రావాలని,ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను చక్కగా చదువుకొని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని డిఇఒ సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రాముడు, ఎంఇఒ - 1 జె రామచంద్రుడు, ప్రధానోపాధ్యాయుడు రామచంద్రుడు, విజయలక్ష్మి, వీర ప్రసాద్, షాహిదా, గాజుల కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా పత్తికొండ ఎమ్మెల్యే కెఇ జన్మదిన వేడుక

ప్రజాశక్తి-మద్దికేర



పత్తికొండ ఎమ్మెల్యే కెయి శ్యాం బాబుకు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నట్లు టిడిపి నాయకులు మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మాజీ జడ్‌పిటిసి లు పురుషోత్తం చౌదరి, రాజన్న యాదవ్, గడ్డం రామాంజనేయులు తెలిపారు. మండల కేంద్రమైన మద్దికేర మెయిన్ బజారులో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు, ఆధ్వర్యంలో పలు రకాల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, పింఛన్, తల్లికి వందనం పథకాలు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మెగా డిఎస్‌సి నిర్వహించి 16 వేలకు పైగా టీచర్ పోస్టులు భర్తీ చేస్తున్నామన్నారు. అన్న క్యాంటీన్లు తిరిగి ప్రారంభించి పేదల కడుపు నింపుతున్నామని, ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం అమలు చేశామన్నారు. అనంతరం హైదరాబాద్లో ఎమ్మెల్యే కెయి నివాసం నందు ఎమ్మెల్యే శ్యాం బాబును కలిసి పుష్పగుచ్చం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ నియోజవర్గ వ్యాప్తంగా గ్రామాల్లో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, గోకులం షెడ్లు నిర్మిస్తూ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇస్తామని, పింఛన్లు అందని అర్హులు ఉంటే వారికి కూడా త్వరలోనే అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి రామాంజనేయులు, తెలుగు యువత నాయకులు చంద్రశేఖర్ గౌడ్, బొమ్మనపల్లి ఆంజనేయులు, మాజీ ఎంపిటిసి శంకర్, నర్రాసుధాకర్, గూడూరు కవిత, రాధమ్మ, పారావిరోబ, తప్పెట శ్రీనివాసులు, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

ఎమ్మెల్యేను, కెడిసిసిబి ఛైర్మన్‌ను కలిసిన సోషల్ మీడియా కోఆర్డినేటర్



ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

తెలుగుదేశం పార్టీ జిల్లా కొత్త కమిటీలో కోడుమూరు నియోజకవర్గం కర్నూలు మండలం, వెంకాయ పల్లె గ్రామానికి చెందిన బోయ నాగేంద్రను కర్నూలు పార్లమెంట్ టిడిపి సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన డి.రాజవర్ధన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి అనంతరం కెడిసిసిబి ఛైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డిని, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలవేసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటామని తెలిపారు.

హోటల్స్ పై విస్తృత దాడులు నిర్వహించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని హోటల్స్ లపై ఫుడ్ శెట్టి అధికారులు దాడులు నిర్వహించాలని ప్రజా పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.బలరాం డిమాండ్ చేశారు. శనివారం అయన విలేకరులతో మాట్లాడుతూ కలెక్టరేట్ సమీపంలో ఉన్న సాయి ఈశ్వర్ హోటల్లో ఇడ్లీ సాంబార్లో బొద్దింక పడిందని హోటల్ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. కర్నూలు నగరంలోని అనేక హోటల్స్‌లో ఆహారం కలుషితమవుతుందని పేర్కొన్నారు. కలుషితమైన ఆహారం తీసుకోవడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతారని పేర్కొన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి ఫుడ్ సేఫ్టీ అధికారులతో హోటల్స్ పై విస్తృత దాడులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్ -బంగారు, వెండి నగలు స్వాధీనం

ప్రజాశక్తి-అనంతపురం : మహిళల మెడలో బంగారు గొలుసులు, ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అనంతపురం సిసిఎస్ పోలీసులతో కలసి త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ. 70 లక్షల విలువజేసే 400 గ్రాములు బంగారు ఆభరణాలు, ఏడు కిలోల వెండి, లక్ష రూపాయల నగదు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసు కాన్ఫిరెన్స్ కార్యాలయంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావుతో కలిసి ఎస్పీ పి.జగదీష్ మీడియాకు వెల్లడించారు.





నంద్యాలలో జీపు జాతాను ప్రారంభిస్తున్న సిఐటియు జిల్లా నాయకులు తోటమద్దులు

తెలుగు గంగ 22వ ఉప కాలువకు గండి

- 60 ఎకరాల్లో సాగుకు నోచని పంటలు
- ఖరీఫ్‌లో తీవ్రంగా నష్టపోయిన రైతులు
- రబీలో కూడా సాగుకు అనుకూలంగా లేని పంట పొలాలు
- పట్టించుకోని తెలుగుగంగ అధికారులు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలం టి లింగందిన్నె, ఆర్.నాగులవరం గ్రామాల మధ్యలో 22వ తెలుగు గంగ ఉపకాలవకు గండిపడింది. గండిపడి దాదాపు ఐదునెలలు అవుతున్నా తెలుగు గంగ అధికారులు గండి పూర్చకపోవడంతో రైతులు దాదాపు 60 ఎకరాల్లో పంటలు సాగు చేయలేకపోతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో 22వ ఉపకాలవ కింద దాదాపు 60 ఎకరాల పైగా వరి పంట సాగు చేశారు. పంట సాగు చేసి పండిన సమయంలో 22వ ఉపకాలవకు గండిపడి నీరంతా పంట పొలాలపై ప్రవహించడంతో కోతలు కోయడానికి వీలు లేక పండిన పంటను రైతులు అలాగే వదిలేశారు. దీంతో ఒక్కో రైతుకు దాదాపు ఎకరాకు రూ.60 వేల దాకా నష్టపోవాల్సి వచ్చింది. గండిపడిన విషయాన్ని తెలుగంగ అధికారులకు రైతులు తెలిపారు. అయితే వారు ఆ సమయంలో గండిపడినచోట తాత్కాలికంగా మట్టి సంచులు వేసి వదిలేశారు. అయితే ప్రస్తుతం 22వ తెలుగు గంగ ఉపకాలవలో నీరు పుష్కలంగా ప్రవహిస్తూ ఉండడంతో గండిపడినచోట యధావిధిగా నీరు పంట పొలాలపై ప్రవహిస్తూనే ఉంది. దీంతో రైతులు రబీ సీజన్లో పంటలు సాగు చేసుకోవడానికి వీలు లేకుండా పోయింది. తెలుగు గంగ అధికారులు గండిపడినచోట తాత్కాలికంగా పనులు చేపట్టడంతో ఎప్పటిలాగనే నీరు అలాగే ప్రవహిస్తూ ఉండడంతో రైతులు పంటలు సాగు చేసుకోలేకపోతున్నారు. దీంతో 60 ఎకరాల్లో పైగా పంట పొలాలను బీడు భూములుగా వదిలేయాల్సిన పరిస్థితిలు నెలకొన్నాయి. తెలుగు గంగ ఉన్నత అధికారులు స్పందించి వెంటనే గండిని పూడ్చివేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.



తెలుగు గంగ 22వ ఉపకాల్వకు పడిన గండి

5 నెలలవుతున్నా గండిని పూల్చడం లేదు

- రైతు సుబ్బయ్య, టి.లింగందిన్నె గ్రామం



తెలుగు గంగ 22వ ఉపకాలవకు గండిపడి ఐదు నెలలవుతున్నా ఇంతవరకు పూడ్చలేదు. నీరంతా పొలాలపై పారి రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకోవడానికి వీలు లేకుండా పోయింది. తెలుగు గంగ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా వారు స్పందించడం లేదు. గంగ ఉన్నతాధికారులు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంటనే గండిని పూడ్చివేయాలి.

పంట పొలాలను బీడు భూములుగా వదిలేశాను

- రైతు వెంకటేశ్వర్లు, టీ లింగం దిన్నె గ్రామం

తెలుగంగ 22వ ఉపకాలమకు గండి పడడంతో నీరంతా పొలాలపై ప్రవహిస్తూ ఉండడంతో సాగుకు వీలు లేక భూములను అలాగే వదిలేసాం. దీంతో పంట భూములు బీడు భూములు అయ్యాయి. ఖరీఫ్ సీజన్లో 2 ఎకరాల్లో వరి సాగుచేశాను. గండి ద్వారా నీరు నా పొలం పై పారడంతో కోత కోయడానికి వీలు లేక పంటను అలాగే వదిలేశాను. దీంతో నాకు రూ.లక్ష దాకా నష్టపోయాను. అధికారులు గండిపడిన చోట తాత్కాలికంగా పనులు చేపట్టకుండా శాశ్వత పనులు చేయించాలి.





గండిపడి పొలాలపై పారుతున్న నీరు

సాగుచేసిన పంటలు తీవ్రంగా నష్టపోయాం

- రైతు వెంకటసుబ్బయ్య, టి.లింగందిన్నె గ్రామం

తెలుగు గంగ 22వ ఉపకాలవ కింద దాదాపు 6 ఎకరాల్లో వరి పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయాను. పంటలు పండి తీరాకోత కోసే సమయంలో కాల్వకు గండిపడి నీరంతా పంట పొలాలపై ప్రవహించడంతో కోతలు కోయడానికి వీలు లేక పంటను అలాగే వదిలేశాను. దీంతో నాకు దాదాపు రూ.3 లక్షలు దాకా నష్టపోయాను. గండిపడిన సమయంలో అధికారులకు చెప్పిన వారు వచ్చి మట్టి సంచులు వేసి వెళ్లారు. మరల యధావిధిగా గండిపడి నీరు పంట పొలాలపై ప్రవహిస్తుంది. ఉన్నతాధికారులు గండిని వెంటనే పూడ్చివేసి రైతులను ఆదుకోవాలి.



జిల్లాలో జీపుజాతాల విస్తృత ప్రచారం

- అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయండి
- కార్మిక వ్యతిరేకి మోడీ విధానాలను ప్రతిఘటించండి..

ప్రజాశక్తి-నంద్యాల కలెక్టరేట్

విశాఖపట్నంలో ఈనెల 31నుంచి జనవరి 4వరకు నిర్వహించే సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చెయ్యాలని కోరుతూ నంద్యాల జిల్లాలో జీపు జాతాలు ప్రారంభమాయ్యాయి. నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల జాతా ఈ నెల 26 ప్రారంభమైంది. 27న వరకు శ్రీశైలం, నందికొట్కూరు నియోజక వర్గాల్లోని పలు మండల్లో ఆటో జాతా ప్రచారం చేస్తుంది. రెండోజాతా నంద్యాల జిల్లా కేంద్రలో శనివారం జీపు జాతా నంద్యాల పట్టణం గాంధీ చౌక్ సెంటర్‌లో సిఐటియు సీనియర్ నాయకులు తోట మద్దులు జెండా ఊపి ప్రారంభించారు. సిఐటియు పట్టణ అధ్యక్షులు కె.మహమ్మద్ గౌస్, కార్యదర్శి పి. వెంకటలింగం, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ తో పాటు సిఐటియు నాయకులు సుబ్బారావు, జైలాన్, చెన్నయ్య, నాగన్న, బుజ్జి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. శ్రీశైలం, నందికొట్కూరు జాతా ఆటో జాతా వెలుగోడు ఆత్మకూర్, పాములపాడు, కొత్తపల్లి, మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించింది. రెండో రోజు శనివారం నందికొట్కూరుకు చేరిన జాతాను నందికొట్కూరులో సిఐటియు ఆటో జాతాను జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరావు ప్రారంభించి మాట్లాడారు. ఈ జాతాలో సిఐటియు నందికొట్కూరు పట్టణ అధ్యక్షులు గోపాలకృష్ణ, మిడ్తూరు సిఐటియు నాయకులు నాగమణి తదితరులు పాల్గొన్నారు. రెండోరోజు నందికొట్కూరుతోపాటు పగిడ్యాల, మిడ్తూరు, గడివేముల మండలాల్లోని పలు గ్రామాలను తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా ఏసు రత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం. నాగేశ్వరావు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను హరించి వేస్తుందన్నారు. పనిగంటల విధానాన్ని పెంచిందన్నారు. యజమానులకు బానిసలుగా మార్చే కేంద్ర ప్రభుత్వ నిరంకుశ పాలనకు చమరిగీతం పాడాలన్నారు. నంద్యాలలో ప్రారంభమైన జీపు జాతా కార్యక్రమం లో సీనియర్ నాయకులు తోట.మద్దులు, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌లు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ ప్రజా వ్యతిరేక విధానాలను మూడు సంవత్సరాల కాలంలో చేసిన పోరాటాలను సమీక్షించుకునే రాబోయే కాలంలో చేయాల్సిన పోరాటాలకు దిశా నిర్దేశం చేసుకునేందుకు ఈ మహాసభలలో తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. అనంతరం సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కె.మహమ్మద్‌గౌస్, పి.వెంకటలింగం మాట్లాడుతూ ఈ జీపుజాతా బండిఆత్మకూరు, సిరివెళ్ళ, రుద్రవరం, కోవెలకుంట్ల, సంజామల, దొర్నిపాడు, ఆళ్లగడ్డ మండల, పట్టణ కేంద్రాలలో రెండు రోజులపాటు నిర్వహిస్తామన్నారు. 28న ఆత్మకూరు పట్టణంలో ప్రారంభమయ్యే జీపుజాతా ఆత్మకూరు నియోజకవర్గం నందికొట్కూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలలో ప్రచారం నిర్వహిస్తున్నారు. మరొక జాత ఈనెల 28న ప్రారంభమై డోన్ పట్టణంలో ప్రారంభమై డోను, బనగానపల్లె నియోజకవర్గ మండల కేంద్రాలలో ప్రచారం నిర్వహిస్తారు. జనవరి 4న విశాఖపట్నంలో లక్షలాదిమంది కార్మికులతో జరిగే భారీ బహిరంగ సభకు నంద్యాల జిల్లా నుండి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలి'

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీశైల దేవస్థానం అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను భక్తులు వినియోగించు కోవాలని దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం వారు మాట్లాడారు. వరుస సెలవులు కావడంతో శ్రీశైలం క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారని చెప్పారు. గతంలో ఎన్నడూ లేనంతగా భారీస్థాయిలో ఆన్‌లైన్ ద్వారా రాబడి వచ్చిందన్నారు. ఆన్‌లైన్ ద్వారా భక్తులు స్వామివారి స్పర్శదర్శనం రూ.300, అతి శీఘ్రు దర్శనం రూ.150 శీఘ్రదర్శనం టికెట్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. 'మనమిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ 95523 00009 ద్వారా కూడా దర్శనం, ఆర్జితసేవలు పొందే అవకాశం కల్పించినట్లు తెలిపారు. అలాగే ఈ నెల 26న ఆన్‌లైన్ ద్వారా దేవస్థానానికి రూ. 73 లక్షల 19 వేల 314 రాబడిగా లభించిందని చెప్పారు. ఆఫ్‌లైన్ ద్వారా కూడా రూ. 73,75,511 రాబడిగా వచ్చిందన్నారు. భక్తులరద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం పలు ఏర్పాట్లు కూడా చేసిందన్నారు. దేవస్థానం సిబ్బందికంతా కూడా ప్రత్యేక విధులను కేటాయించామన్నారు. భక్తుల సౌకర్యార్థమై క్షేత్రపరిధిలో ఆన్‌లైన్ నమోదు సహాయ కేంద్రాలను నందిగుడి దగ్గర, రథశాల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విరాళాల సేకరణ కేంద్రం, క్యూలైన్ ప్రవేశద్వారం ఎదురుగా, పాత విరాళాల కేంద్రం వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవస్థానం కల్పిస్తున్న ఆన్‌లైన్ సేవలను భక్తులు విరివిగా వినియోగించుకోవాలని కోరారు.

బనగానపల్లెలో మంత్రి బీసీ సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె పట్టణంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న కొట్నాల లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని మంత్రి పరిశీలించారు. అనంతరం ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాలయానికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో జరుగుతున్న ఏర్పాట్లు, భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూ లైన్‌లో దర్శన ఏర్పాట్లు, పోలీసు భద్రత, బారికేడ్లు ఏర్పాటు వంటి అంశాలపై స్థానికులతో మంత్రి చర్చించారు. ఆ తర్వాత బైపాస్ రోడ్డు పనులను పర్యవేక్షించారు. నిర్మాణ పనులు జరుగుతున్న తీరు తెన్నులను పరిశీలించారు. రవ్వలకొండపై ఉన్న డంప్ యార్డును మంత్రి పరిశీలించారు. చెత్తను డంప్ చేసే విధానం, డంప్ యార్డ్ నిర్వహణ వంటి అంశాలను అక్కడ పనిచేసే కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించి, అక్కడ మౌలిక వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తున్న తీరు, సిలబస్ ఎంత వరకు పూర్తయిందనే అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో కిచెన్ రూమ్‌ను సందర్శించి ఆహార పదార్థాల నాణ్యత ప్రమాణాలను రుచి చూసి తెలుసుకున్నారు. పక్కనే ఉన్న బిసి బాలుర హాస్టల్ ను సందర్శించి హాస్టల్లో పారిశుధ్యం, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని హాస్టల్ వార్డెన్ లకు మంత్రి బిసి ఆదేశించారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్‌ను సందర్శించి పాఠ్యాంశాల బోధన, మౌలిక వసతులపై విద్యార్థులను ఆరా తీశారు. ఈ సందర్భంగా బాలికల హాస్టల్‌లో తాగునీటి సమస్య ఉందని విద్యార్థినిలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే రూ. 3 లక్షల సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంత్రి సందర్శించి కళాశాలలో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు. త్వరితగతిన భవన నిర్మాణాలు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత, మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బాలాజీ, బీసీ హాస్టల్ వార్డెన్ నాగేంద్ర, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామలక్ష్మి పాల్గొన్నారు.



హాస్టల్లో భోజనాన్ని పరిశీలిస్తున్న మంత్రి బీసీ.జనార్ధన్ రెడ్డి



మాట్లాడుతున్న బాధిత రైతు రామ్మోహన్ రెడ్డి

కంది పంటను కోసుకెళ్ళిన దుండగులు

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల పట్టణంలోని ధరణి టౌన్‌షిప్ దగ్గర రైతు రామ్మోహన్ రెడ్డికి చెందిన మూడు ఎకరాల పొలంలో కంది పంటను గుర్తుతెలియని వ్యక్తులు కోసుకెళ్లిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. రైతు రామ్మోహన్ రెడ్డి తన తండ్రికి అనారోగ్యంగా ఉండడంతో ఆసుపత్రికి చూపించడానికి కర్నూలు తీసుకెళ్లాడు. మూడు రోజులు బేతంచెర్లలో ఉండకపోవడంతో అదును చూసి గుర్తు తెలియని వ్యక్తులు చేతికొచ్చిన కంది పంటను ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు మొత్తం కోసుకొని వెళ్లారు. శనివారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు పంట కోసుకెళ్లడాన్ని చూసి హతాశుడయ్యాడు. వెంటనే బేతంచెర్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. దాదాపు 1,50,000 నష్టం వాటిల్లిందని, సంబంధిత అధికారులు తమకు న్యాయం జరిగేలా చూడాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామాల్లో జరుగుతున్న రీసర్వేకు రైతులు సహకరించాలని తహశీల్దార్ ఉమారాణి, డిప్యూటీ తహశీల్దార్ పెద్దన్న కోరారు. శనివారం మండలంలోని గుమ్మడాపురం గ్రామంలో భూ రీ సర్వే చేపట్టేందుకు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న రీసర్వేకు రైతులు సహకరించాలన్నారు. గ్రామాల్లో ఈ సర్వేను అధికారులు ఇరువురి రైతులతో కలిసి చేయాలన్నారు. రీ సర్వే జరుగు సమయంలో ప్రతి ఒక్క రైతు సహకరించి వారి పొలం హద్దులు గ్రామ సర్వేకి, వీఆర్వోలకి తగిన హక్కు పత్రాలతో హాజరై చూపించుకోవాలని సూచించారు. వారికి ఉండే భూమిని నిర్ణయించుకోవాలని, భూమి తగాదాలు లేకుండా పరస్పర రైతులు సహకార భావంతో అలయన్స్ లోపల ఉన్న వాటికి సర్దుబాటు చేసుకోవాలని తెలిపారు. వేరియేషన్ ఇద్దరు రైతుల మధ్యన ఎక్కువగా ఉంటే ఆర్ఓఆర్ కండక్ట్ చేసి రైతులందరికీ తగిన న్యాయం చేసేందుకు ప్రయత్నం చేస్తారన్నారు. గ్రామ సభలో సర్పంచ్ విజయకుమార్, గ్రామ రెవిన్యూ అధికారి శ్రీనివాసులు, విలేజ్ సర్వేయర్ శ్రీకాంత్, రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ తహశీల్దార్

శ్రీశైలంలో ఆధ్యాత్మిక గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

శ్రీశైలంలోని మల్లికార్జున సదన్‌లోని హాల్‌లో దేవస్థానం నూతనంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్‌నాయుడు, కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఈ గ్రంథాలయంలో పురాణాలు, ఇతిహాసాలు, భక్తిసాహిత్యం మొదలైన గ్రంథాలను భక్తులకు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రస్తుతం గంగాధర మండపం వద్ద గల తిరుపతి సత్రం పాత భవనాన్ని తొలగించి ఆ ప్రదేశంలో ఆధ్యాత్మిక గ్రంథాలయం, మ్యూజియం, గదులను నిర్మించనున్నట్లు చెప్పారు. అనంతరం ఇఒ మాట్లాడుతూ భక్తులలో భక్తిభావాలను మరింతగా పెంపొందించి వారిలో ఆధ్యాత్మిక చింతను కలిగించేందుకు ఈ గ్రంథాలయం ఎంతగానో తోడ్పడుతుందన్నారు. దశలవారిగా గ్రంథాలయాన్ని విస్తరిస్తామన్నారు. ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం వారి నుంచి సుమారు 1000కి పైగా గ్రంథాలను, 1400లకు పైగా ఇతర ఆధ్యాత్మిక గ్రంథాలను అందుబాటులో ఉంచామన్నారు. ఈ గ్రంథాలయంలో దినపత్రికలను, పలు ఆధ్యాత్మిక మాసపత్రికలను కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ సందర్భంగా శ్రీశైల క్షేత్రంపై దేవస్థానం ఇటీవల ప్రచురించిన కాఫీ టేబుల్ బుక్‌ను కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు ధర్మకర్తల మండలికి అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు ఎవి.రమణ, బి.రవణమ్మ, చిట్టిబొట్ల భరద్వాజశర్మ, జి.లక్ష్మీశ్వరి, జి.గంగమ్మ, శంకరశెట్టి పిచ్చయ్య, జె.రేఖాగౌడ్, ఎ.అనిల్‌కుమార్, బి.వెంకట సుబ్బారావు, చిలువేరు కాశీనాథ్, మేడ మురళీధర్, జిల్లెల శ్రీదేవి, ప్రత్యేక ఆహ్వానితులుగా కె.నాగమల్లేశ్వరరావు, బి.చంద్రమౌళీశ్వరరెడ్డి, కట్టా సుధాకరరెడ్డి, వి.వెంకటేశ్వర్లు, ఎ.శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీశైల దేవస్థానం చైర్మన్, ఇఒ

అభివృద్ధే ధ్యేయంగా ముందడుగు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ప్యాపిలి

అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం ప్యాపిలి మండలం నల్ల మేకలపల్లె గ్రామంలో రూ.32 లక్షలతో పంచాయతీ కార్యాలయానికి, ప్యాపిలి పట్టణంలో కస్తూరిబా పాఠశాలలో రూ.69 లక్షలతో అదనపు గదుల నిర్మాణానికి డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అలాగే ఎంపీడీవో కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి ఎమ్మెల్యే వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పరిష్కార వేదికలో పారిశుధ్యం, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే అయ్యప్ప స్వామి దేవస్థానంలో పడిపూజ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డోన్ మున్సిపల్ చైర్మన్ ప్రసాద్ గౌడ్, టిడిపి మండల ఇంచార్జ్ ప్రభాకర్ రెడ్డి, టి.శ్రీనివాసులు, ఖాజాపీర్, మండల అధ్యక్షుడు సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు కొంగనపల్లి మధు, బత్తుల రమేష్ రెడ్డి, రాష్ట్ర శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ కుమ్మరి సుధాకర్, తహశీల్దార్ భారతి, ఎంపీడీవో శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్, పిఆర్ఏఈ ప్రభాకర్ రెడ్డి, ఈఓ శివకుమార్ గౌడ్, ఎన్ఆర్ఈజీఎస్ ఎపిఓ రవీంద్ర, ఎంఈఓ వెంకటేష్ నాయక్, హౌసింగ్ ఏఈ వెంకటేష్, సత్యం, రాజశేఖర్, నాగేశ్వరరావు, రామ్మోహన్, మహేష్, హరి, బాబు, రాంపురం నాగేశ్వరరావు, రమేష్ గౌడ్, చల్లా వీర, వెంకటేష్, సుంకన్న, ఎస్‌కె వలి, దస్తగిరి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల

కబడ్డీ, ఖోఖో క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-వెలుగోడు

వెలుగోడు పట్టణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కబడ్డీ, కోకో క్రీడాకారులకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో 20 వేల రూపాయల విలువచేసే క్రీడా దుస్తులను నాయకులు జయరామిరెడ్డి, సుల్తాన్ మోహిద్దీన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు హెచ్‌ఎం మాలిక్ ఖాన్ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాలిక్ ఖాన్, ఇన్చార్జ్ హెచ్‌ఎం మొయినుద్దీన్, ఉపాధ్యాయులు రామకృష్ణ మాట్లాడుతూ పాఠశాల మౌలిక వసతులతో పాటు క్రీడాకారుల అభ్యున్నతి కోసం పూర్వ విద్యార్థుల సంఘం వారు చేస్తున్న సేవలు అభినందనీయ మన్నారు. అదే సమయంలో క్రీడాకారులు చదువుతోపాటు క్రీడల్లో కూడా ప్రతిభను చాటి జాతీయస్థాయికి ఎదగాలన్నారు. జిల్లాస్థాయిలో పాఠశాల కబడ్డీ క్రీడాకారులు విజేతలుగా నిలవడం సంతోషకరమన్నారు. అదే ఉత్సాహంతో జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. ప్రతిభగల క్రీడాకారులుగా తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులను కోచ్ సయ్యద్ అబ్దుల్ వాహీద్‌లను అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శేషశైన శర్మ, శంషుద్దీన్, ముల్లా అబ్దుల్ రఫీ, మజాహర్ అలీ ఖాన్, సుఫియాన్, శ్రీను, రిహాన్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు

29న జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహణ

- 7 విభాగాల్లో సేవలు : కలెక్టర్ జి.రాజకుమారి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో ప్రజల రెవెన్యూ సమస్యలకు వేగవంతమైన పరిష్కారం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 29వ తేదీ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా స్థాయి రెవెన్యూ క్లినిక్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్ ఆవరణలో మొత్తం 7 రెవెన్యూ క్లినిక్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి రెవెన్యూ సంబంధిత అర్జీలను స్వీకరించి, వాటిని నమోదు చేసి, సమస్యల స్వరూపాన్ని బట్టి అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపడతామన్నారు. ఇందుకోసం సంబంధిత విభాగాలకు చెందిన ఆర్డీఓలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, తహశీల్దార్లు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందిస్తారని తెలిపారు. రెవెన్యూ క్లినిక్స్‌ను రెవెన్యూ, గ్రామ, వార్డు సచివాలయ సేవలు, అడంగల్ సవరణలు, 22ఎ, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలు, రెవెన్యూ కోర్టు విచారణలు, ఆర్ఓఆర్ కేసులు, సర్వే, రీ-సర్వే, దేవదాయ, వక్ఫ్ భూములు తదితర విభాగాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రెవెన్యూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆత్మకూరు

తెలుగుదేశం పార్టీ ఒక కుటుంబంలాంటిదని, పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. టిడిపి జిల్లా కార్యవర్గ నిర్వాహక సభ్యుడిగా ఎన్నికైన తిమోతి ఎమ్మెల్యేను శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికి ఏదో ఒక రోజు పదవులు దక్కుతాయని, పదవులు ఉన్నా లేకున్నా ప్రజల కోసం పని చేస్తూ ప్రజలలో పార్టీ విధానాలను తీసుకువెళ్లాలన్నారు. ఆ దిశగా తిమోతి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బుడ్డ రాజశేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న తిమోతి



అధికారులతో మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి

మిడుతూరు మండలానికి
ఎత్తిపోతల పథకం మంజూరు : టిడిపి

ప్రజాశక్తి - మిడుతూరు

మిడుతూరు మండలానికి ఎత్తిపోతల పథకం మంజూరయిందని టిడిపి మండల కన్వీనర్ ఖాతా రమేష్ రెడ్డి తెలిపారు. ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, డిఈ చంద్రశేఖర్, ఏఈ నవీన్ ఇంద్రసేన తదితరులతో లిసి ఆయన ఎత్తిపోతల పథకం చేపట్టే ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. హంద్రీనీవా నుండి 19వ కిలోమీటర్ రాయి వద్ద ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించడానికి దాదాపు 60 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ఎన్నికలలో నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య ఇచ్చిన మాట మేరకు మిడుతూరు మండలానికి ఎత్తిపోతల పథకాన్ని ప్రభుత్వం నుండి సాధించారని చెప్పారు. వారికి మండల ప్రజలు జీవితకాలం రుణపడి ఉంటారని తెలిపారు. ఈ ఎత్తిపోతల పథకం ద్వారా నీళ్ల కలమందలపాడు చెరువుకు చేరుతాయన్నారు. అక్కడి నుండి కుందూనది నీళ్ల వదులుతారని, కుందునది పరివాహ ప్రాంతాలైన చౌట్కూరు, బన్నూరు, గుడిపాడు, దేవనూరు, చింతలపల్లి, సుంకేసుల, జలకనూరు, తలముడిపి తదితర గ్రామాలకు నీరు అందుతుందన్నారు. అలాగే నాగపల్లె చెరువు, మద్దిగుండం చెరువు, తలముడిపి చెరువులు ఈ నీటితో నింపవచ్చన్నారు. కలమందలపాడు చెరువు ద్వారా కాకిలేరు వాగుకు నీళ్ల వదిలితే అక్కడి నుండి కడుమూరు, పీర్సాపేట, మిడుతూరు, చెరుకుచెర్ల, బైరాపురం, పారుమంచాల చెరువుకు చేరుతాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సర్వోత్తమ్ రెడ్డి, వీరారెడ్డి, బుస గౌడ్, జిసర్వోత్తమ్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాటసాని జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పాణ్యం

పాణ్యం మండలంలోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి జన్మదిన వేడుకలను మాజీ జెడ్పిటిసి సద్దల సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సద్దల సూర్యనారాయణ రెడ్డి పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆ తర్వాత శాంతిరాం జనరల్ హాస్పిటల్ నందు యువకులు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలవడం ఖాయమన్నారు. కూటమి పాలన పట్ల ప్రజలు విసుగు చెందారన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు రామ లక్ష్మయ్య, మండల



కేక్ కట్ చేసి కాటసాని జన్మదిన వేడుకలను జరుపుకుంటున్న సూర్యనారాయణ రెడ్డి

అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి, చందమామ బాబు, పాణ్యం మాజీ సర్పంచ్ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

30న సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలంలో 2024-2025 సంవత్సరానికి సంబంధించి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులపై ఈనెల 30న సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఏపీఎం ప్రకాష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామపంచాయతీలలో 1/4/2024 నుండి 31/3/2025 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై గ్రామపంచాయతీలలో 19/11/25 నుండ 26/12/25 వరకు 18వ విడత సామాజిక తనిఖీ జరిగిందని తెలిపారు. సామాజిక తనిఖీల్లో గుర్తించిన వాటిపై ఈనెల 30న మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బహిరంగ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - అవుకు

అవుకు పట్టణంలోని అతి పురాతనమైన భూలక్ష్మి సమేత చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈనెల 30న వైకుంఠ ఏకాదశి వేడుకల సందర్భంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చెన్నకేశవ స్వామి ఆలయ కమిటీ బృందం సభ్యులు శనివారం తెలిపారు. ఈ ఉత్సవాలకు ఆలయానికి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరింపజేసి స్వామివారి ఉత్సవ మూర్తులను ఉత్తర ద్వారా దర్శనం భక్తులకు దర్శనం కలిగించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తుండడంతో ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

29న కేంద్ర పంచాయతీరాజ్ శాఖ జాయింట్ సెక్రటరీ రాక


ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కేంద్ర పంచాయతీరాజ్ శాఖ జాయింట్ సెక్రటరీ రాజు కుమార్ సింగ్ ఈనెల 29న బెలుం గుహలకు వస్తున్నట్లు ఎంపీడీవో దస్తగిరి బాబు తెలిపారు. ఆయన రాక సందర్భంగా బెలుం గుహల ప్రత్యేక ఏర్పాట్లు, వసతులను ఆయన శనివారం పరిశీలించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన బెలుం గుహలపై మరింత పరిశోధన జరగనుంది. పురావస్తు శాఖ సంపద సందర్శన, సంరక్షణ చర్యల్లో భాగంగా ఈ పర్యటన కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. కడప జిల్లాలోని గండికోట సందర్శన అనంతరం ఆయన బెలుం గుహలను సందర్శిస్తారని అధికారులు వెల్లడించారు.

స్పెల్లింగ్ నైపుణ్యాలను పెంపొందించేందుకే 'స్పెల్ బి'

ప్రజాశక్తి - కొత్తపల్లి

విద్యార్థుల్లో స్పెల్లింగ్ నైపుణ్యాలను పెంపొందించేందుకు స్పెల్ బీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎంఈఓ నాగరాజు అన్నారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం నందు ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులలో పదజాల నైపుణ్యాలను పెంపొందించేందుకు స్పెల్ బి కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పదాలను తప్పులు లేకుండా రాయడం, చదవడం, వివరించడం వంటివి చేయవచ్చన్నారు. స్పెల్ బీ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో 6తరగతి నుంచి 9 వతరతగతి విద్యార్థులకు 22 మందికి పరీక్షలు నిర్వహించామన్నారు. ఇందులో నలుగురు ఎంపిక అయ్యారన్నారు. వారిలో గువ్వలకుంట్ల జెడ్పీహెచ్ఎస్ నుంచి 6వ తరగతి విద్యార్థిని జె.లక్ష్మీ, 7వ తరగతి నుంచి వై.హర్షిక, కొత్తపల్లి కేజీబీవీ పాఠశాల నుంచి ఎమిదవ తరగతి చదువుతున్న వి.ప్రణిత, కొత్తపల్లి జెడ్పీహెచ్ఎస్ నుంచి తొమ్మిదవ తరగతి చదువుతున్న కె.శివతేజ ఆచారి మండల స్థాయిలో ఎంపికయ్యారన్నారు. వీరు త్వరలో జరిగే జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. అక్కడ ఉత్తమ ప్రతిభ కనపరిస్తే రాష్ట్రస్థాయికి ఎంపికవుతారన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ నాగరాజు

కొయ్యలకు నిప్పు.. భూసారానికి ముప్పు..

- మిత్ర పురుగులు, సూక్ష్మ జీవులు నశించిపోయే ప్రమాదం

ప్రజాశక్తి - బనగానపల్లె

పొలాల్లో పంట కోతలు పూర్తయిన తర్వాత వరి, మొక్కజొన్న, పత్తి తదితర కొయ్యలను కాల్చివేస్తున్నారు. ఫలితంగా భూసారం తగ్గడంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. యంత్రాలతో వరి కోత కోయడం వల్ల కొయ్యలు భూమి స్థాయికి కోయడం లేదు. ఈ కొయ్యలను తొలగించడం ఆర్థిక భారమని రైతులు వాటిని కాల్చి వేస్తున్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో అత్యధికంగా వరి, మొక్కజొన్న పంటలను రైతులు సాగు చేశారు. పంటల నూర్పిడి అనంతరం కొయ్యలను రైతులు పొలాల్లోనే కాల్చివేస్తున్నారు. సాగు భూముల్లో ప్రతిసారి కొయ్యలను కాల్చి వేయడం వల్ల భూమిలో పంటలకు ఉపయోగపడే మిత్ర పురుగులు, సూక్ష్మజీవులు నశించిపోతాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. తద్వారా క్రమంగా దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుందని, దీనిపై అధికారులు ప్రతి సీజన్‌లో ప్రత్యేకంగా రైతులతో మాట్లాడి మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఒకవైపు మితిమీరిన రసాయన ఎరువులు, గడ్డి మందులను వినియోగించడంతోపాటు మరోవైపు కొయ్యలకు నిప్పు పెట్టడంతో భూమిలో సారం తగ్గుతోంది. వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమి బిగువుగా మారి, నీటిని పీల్చుకునే గుణాన్ని కోల్పోయే అవకాశం ఉంది. కాల్చిన చోట భూమి సేంద్రీయ పదార్థాన్ని కోల్పోతుంది. దీంతో పాటు పంటలకు తోడ్పాటు అందించే సూక్ష్మ జీవులపై తీవ్ర ప్రభావం ఏర్పడుతోంది.

ఇలా చేస్తే మేలు : పొలంలో కొయ్యలను దున్నే 10 రోజుల ముందు నీరు పెట్టాలి. తర్వాత ఎకరాకు 50 కిలోల సూపర్ పాస్పేట్‌ను చల్లాలి. దీంతో భూమిలో సేంద్రీయ పదార్థాల స్థాయిని పెంచవచ్చు. ఈ పద్ధతి పాటించడం వల్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరిగి దిగుబడి కూడా పెరుగుతుంది. ఏటా కోల్పోతున్న భూ సారాన్ని వృద్ధి చేసుకునేందుకు పొలాల్లో జనుము, పెసర, జీలుగను సాగు చేయడంతో పాటు సాధ్యమైనంత వరకు రసాయన మందుల వాడకం తగ్గించాలి.



వరి కొయ్యలను పొలంలోనే కాల్చిన రైతులు

సేంద్రీయ వ్యవసాయం వైపు దృష్టి సారించాలి : వర్షాకాలంలో పంటలు సాగు చేసే రైతులు పచ్చి రొట్టెను ఎలాగైతే సాగు చేసి భూమిలో దున్నుతున్నారో అదే విధంగా వరి కొయ్యలను కలియదున్ని కొంతకాలం పాటు పొలంలోనే నీటిలో మరిగేలా చేస్తే పంటలకు ఎలాంటి నష్టం కలిగించే అవకాశం ఉండదు. రసాయన ఎరువులు కాకుండా పశువుల పేడ, పశువుల ఎరువుల వంటివి వినియోగిస్తే భూమి ఆరోగ్యంగా ఉంటుంది. ప్రతి సీజన్‌లో పంటలను నూర్పిడి చేస్తూ సాగు చేసుకుంటే మరింత లాభదాయకంగా దిగుబడులు సాధించవచ్చు.

కొయ్యలను కాల్చరాదు



రైతులు పంట కోసిన తర్వాత ఎట్టి పరిస్థితిల్లోనూ కొయ్యలను కాల్చరాదు. కొయ్యలకు నిప్పు అంటిస్తే భూసారం దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ విషయంపై ఇప్పటికే గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాం. జీలుగ, పిల్లపెసర వంటివి సాగు చేయడం వల్ల భూసారం వృద్ధి చెందుతుంది.

సి.సుబ్బారెడ్డి, మండల వ్యవసాయ అధికారి.

అదుపు తప్పితే.. ప్రాణానికే ముప్పు

- రక్షణ గోడలు లేని తెలుగు గంగ ప్రాజెక్టు కాలువ ప్రధాన రోడ్డు

ప్రజాశక్తి - వెలుగోడు

ఆత్మకూరు నుండి నంద్యాలకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న తెలుగు గంగ ప్రాజెక్టు ప్రధాన కాల్వ దగ్గర ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ఏమాత్రం అదుపు తప్పిన కాల్వలో పడి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. వెలుగోడు నుండి మూడు కిలోమీటర్ల దూరంలో బానకచర్ల నుండి ప్రవహిస్తున్న తెలుగంగ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ ప్రవహిస్తుంది. ఈ కాల్వపై ఉన్న ఆత్మకూరు నుండి నంద్యాలకు వెళ్లే రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తెలుగంగ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ దగ్గర అదుపు తప్పితే పరిస్థితి ఊహించని విధంగా ఉంటుంది. ఈ కాలువ దాదాపు 30 అడుగుల లోతు ఉంటుంది. ఈ కాల్వలో నిరంతరం నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. అలాంటి కాలువకు కనీసం సైడ్‌వాల్ కూడా నిర్మాణం చేపట్టలేదు. డ్రైవర్ ప్రమాదవశాత్తు అదుపు తప్పి కాలువలో పడితే ఆనవాళ్లు కూడా దొరకని పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం ప్రాజెక్టుల కోసం, కాలువల కోసం వందల కోట్ల నిధులు వెచ్చిస్తున్నామని చెబుతుంది. ఆ నిధులలో నుండి ఈ ప్రధాన కాలువకు సైడ్ వాల్ నిర్మాణం చేపట్టలేకపోతున్నారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి తక్షణమే సైడ్ వాల్ నిర్మాణం చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.




తెలుగు గంగ ప్రాజెక్టు ప్రధాన కాలువపై సైడ్ వాల్ లేని ప్రధాన రహదారి

చివరి ఆయకట్టుకూ నీరు వదలాల్సిందే : ఎంపిపి

ప్రజాశక్తి - శిరివెళ్ల

శిరివెళ్ల మండల పరిధిలోని తెలుగుగంగ, కేసీ కెనాల్ ఆయకట్టు కింద చివరి ఆయకట్టు వరకూ సాగునీరు వదలాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నాయక్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 2025 ఖరీఫ్ సీజన్‌లో పలు తుఫాన్లు అన్నదాతల పాలిట శాపంగా మారి దిగుబడులు పతనం అయ్యాయన్నారు. తద్వారా రైతన్నలు కోలుకోలేని నష్టాలను చవి చూశారన్నారు. చివరి ఆయకట్టు వరకు ఏప్రిల్ నెల వరకు సాగునీరు అందిస్తే రెండవ పంట రబీలోనైనా అధిక దిగుబడులు సాధించి నష్టాల నుండి గట్టెక్కే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. పంచాయతీరాజ్ డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసుల శర్మ, గ్రామ వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపీడీఓ అశ్విన్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ నుండి సిహెచ్‌ఓ రామ మోహన్ రెడ్డి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. శిరివెళ్ల మండలం యర్రగుంట్ల గ్రామంలోని హైవే డ్రైనేజీలు 264 కిలోమీటర్ పరిధిలో అస్తవ్యస్తంగా నిర్మాణం చేపట్టారని, తద్వారా వర్షపు నీరు డ్రైనేజీ కాలువలలో నిలిచి ఉన్నాయని తెలిపారు. తద్వారా దోమలు ఉత్పత్తి అయ్యి అంటువ్యాధులు ప్రబలుతున్నాయని యర్రగుంట్ల మేజర్ పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ సత్తారు బ్యాంక్ ప్రతాపరెడ్డి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. శిరివెళ్ల నుండి గోస్పాడు శిరివెళ్ల నుండి చిన్న కంబలూరు మెట్ట తదితర రహదారులు ప్రతిపాదనలో ఉన్నాయని, అనుమతులు మంజూరు కాగానే నిర్మాణాలు చేపడతారని ఎంపీడీవో సి.శివమల్లేశ్వరప్ప తెలియజేశారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దృశ్యం

ఉపాధి పనులు 200 రోజులు కల్పించాలి

- ఎంపీ బైరెడ్డి శబరికి వ్యకాస, సిపిఎం వినతి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఉపాధి హామీ చట్టం ద్వారా కుటుంబానికి రెండు వందల రోజులు పని కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం నందికొట్కూరులో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభానికి విచ్చేసిన ఎంపీ బైరెడ్డి శబరికి సిపిఎం మండల కార్యదర్శి నాగన్న, ఎం.కర్ణ, ఉస్మాన్ బాషా, జయరాణి, లక్ష్మీ, శ్రీనులతో కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎం.నాగేశ్వరావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మార్చి వాటి స్థానంలో కొత్తగా వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజు గారు అండ్ అజ్విక మిషన్ గ్రామీణ చట్టాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న చట్టంలో కేంద్రం 90 శాతం రాష్ట్రాల్లో 10 శాతం బడ్జెట్ నిధులు కేటాయించాలని ఉండగా దాన్ని సవరిస్తూ నేడు రాష్ట్రాలపై 40 శాతం వాటా భరించాలని సవరణ చేయడం విచారకరమన్నారు. ఉపాధి హామీ ఉపాధి హామీ చట్టం ద్వారా కుటుంబానికి రెండు వందల రోజులు పని కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు రూ.600 వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనుల దగ్గర సౌకర్యాలు కల్పించాలని, ఉపాధి కూలీలందరికీ గడప, సలిక, పికాసి పనిముట్లు ఇవ్వాలని, మున్సిపాలిటీ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులు కల్పించాలని కోరారు. అలాగే నందికొట్కూరు ఆర్టీసీ బస్టాండ్‌లో 11 మంది స్వీపర్స్ గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్నారని, వారికి అరకొర వేతనాలు ఇచ్చి కాంట్రాక్టర్ శ్రమ దోపిడీ చేసుకుంటున్నారని అన్నారు. వర్కర్స్కు పిఎఫ్, ఈఎస్ఎస్ సౌకర్యం కల్పించడం లేదని, కనీసం పని చేసే సమయంలో బ్లౌజులు, శానిటైజర్ సప్లై చేయడం లేదన్నారు. కార్మికులకు దుస్తులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం ఎంపీ స్పందిస్తూ ఈ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రామసుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ శబరికి వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

దళిత కాలనీల్లో మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత

- ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

దళిత కాలనీలలో ఎంపీ నిధుల ద్వారా నిర్మాణం చేసే మినరల్ వాటర్ ప్లాంట్లకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. శనివారం నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పగిడ్యాల రోడ్డులోని బైరెడ్డి నగర్, సిఎస్ఐ పాలెం, సంతగేటు స్కూల్ సమీపంలో, ప్రభుత్వం ఆసుపత్రి ఆవరణలో, ఆర్‌టిసి కొత్త బస్టాండ్ ఆవరణలో ఎంపీ నిధులు రూ. 35 లక్షలతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్లను ఎంపీ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ స్కూల్స్, ప్రభుత్వం ఆసుపత్రులు, ఆర్‌టిసి బస్టాండ్లతో పాటు నిరుపేదలు అధికంగా ఉన్న కాలనీలలో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి శుద్ధి చేసిన మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జిల్లా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎంపీ నిధులు ఎక్కువ ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రజలు కూడా మినరల్ వాటర్ ప్లాంట్ల వద్ద క్యూ పద్ధతి, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. శుద్ధి చేసిన మంచినీరుతో ఎక్కువగా రోగాలు దూరం అవుతాయన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ చాంద్ బాషా, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కాకరవాడ చిన్న వెంకటస్వామి, రైల్వే జోనల్ వినియోగదారుల సలహా కమిటీ మెంబర్ నాగేశ్వరావు, మురళీధర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రఘు రామిరెడ్డి పాల్గొన్నారు.



మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి



గోకులం షెడ్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

పాడి పరిశ్రమకు పెద్దపీట : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాములపాడు

రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమకు పెద్ద పీట వేస్తుందని, పశువుల అభివృద్ధి కోసం చేపట్టిన గోకులం షెడ్లతో నిర్మాణాల వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం ఉందని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. శనివారం మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో వెంకటేశ్వర్లు, నసిరుల్ల, అబ్దుల్, గోపాల్, చాంద్ బాష, అబ్దుల్ వహీద్‌లకు చెందిన గోకులం షెడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో గోకులం షెడ్లు పూర్తి చేసిన లబ్ధిదారులకు మేలు చేకూరుతుందన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని తెలిపారు. సిసి రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ వంటి మౌలిక వసతుల సమస్యలు ఉంటే వాటికి వెంటనే పరిష్కార మార్గం చూపుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తహశీల్దార్ సుభద్రమ్మ, ఏపీఓ జయంతి, టిడిపి మండల కన్వీనర్ రవీంద్రనాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు హరినాథ్ రెడ్డి, జెడ్పిటిసి రామలింగేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్లు రాయపాటి గోవిందు, జనార్దన్ రెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, శివ శంకర స్వామి, మద్దూరు తిమ్మారెడ్డి, వరప్రసాద్, మధు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోబీఘాట్ల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలో దోబీ ఘాట్ల నిర్మాణానికి అధికారులు శనివారం భూమి పూజ చేశారు. నిర్మాణాలకు మున్సిపాలిటీ నిధులు 3 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఆత్మకూరు పట్టణంలో రజకుల కోసం దోబీ ఘాట్లు



భూమి పూజ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నిర్మించాలని, ఆక్రమణ గురవుతున్న దోబీ ఘాట్ల స్థలాలు రక్షించాలని రజకులు పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు, మున్సిపాలిటీ అధికారులకు వినతి పత్రాలు అందించారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో స్థానిక మున్సిపాలిటీ నిధులు దోబీ ఘాట్ల నిర్మాణానికి మంజూరు చేయించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు జెట్టి వేణుగోపాల్, మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు ఎంఎ రషీద్, రజక సంఘం నాయకులు, మున్సిపాలిటీ అధికారులు పాల్గొన్నారు.

నిరంతర సాధన విజయానికి కీలకం

- డాక్టర్ రవికృష్ణ

ప్రజాశక్తి - నంద్యాల

నిరంతర సాధన క్రీడా పోటీల్లో విజయానికి కీలకమని ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ ఒలింపిక్ చైర్మన్ డాక్టర్ రవికృష్ణ పేర్కొన్నారు. ఇటీవల జరిగిన నంద్యాల జిల్లా స్థాయి తైక్వాండో ఓపెన్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచిన వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులను నంద్యాల క్రీడా సమాఖ్య కార్యాలయంలో శనివారం డాక్టర్ రవికృష్ణ అభినందించారు. సర్దార్ అలీ ఖాన్, షానవాజ్ శిక్షణలో తర్ఫీదు పొందిన ఎస్‌డిఆర్ స్కూల్, బాలాజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్, బాల అకాడమీ, ఎల్‌కెఆర్ గ్లోబల్ స్కూల్, జ్యోతిర్మయి పాఠశాల, శ్రీ చైతన్య స్కూల్, ఉస్మానియా ఇంగ్లీష్ మీడియం స్కూల్, మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు వివిధ కేటగిరీలలో విజేతలుగా నిలిచి పతకాలు అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలలో విద్యార్థులు పాల్గొనడం ద్వారా శారీరక దారుఢ్యం, మానసిక స్థైర్యం ఇనుమడిస్తుందని అన్నారు. క్రీడలలో విజయం సాధించడానికి మంచి కోచ్‌ల పర్యవేక్షణలో క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన కీలక పాత్ర వహిస్తుందన్నారు. జిల్లాస్థాయిలో విజేతలు గా నిలిచిన వారు భవిష్యత్తులో రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. తైక్వాండోలో శిక్షణ ఇస్తున్న కోచ్‌లు సర్దార్, షానవాజ్‌లను ప్రత్యేకంగా అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న డాక్టర్ రవికృష్ణ

రూ. 1.80 కోట్లతో పంప్ హౌస్ నిర్మాణం

- డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి

ప్రజాశక్తి - ప్యాపిలి

డోన్ మండలంలోని గుండాల గ్రామంలో రూ.1 కోటి 80 లక్షల వ్యయంతో పంప్ హౌస్, చెక్ డ్యామ్ నిర్మాణం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం డోన్ పట్టణంలోని శ్రీరామ్ నగర్‌లో వున్న ఉమర్ బిన్ కతాబ్ మజీద్ సమీపంలో ఆల్ మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ అఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్నట్లు బాలికల మదరస ఫౌండేషన్ శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మదరసా విద్యా సదుపాయాల అభివృద్ధి నిర్వహణకు, విద్యార్థుల శ్రేయస్సు కోసం లక్ష రూపాయల విరాళాన్ని ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం పంప్ హౌస్, చెక్ డ్యాంకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనార్టీల విద్యా పురోగతికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. కొత్త బురుజు, చిన్నపూదేళ్ల గ్రామాలకు పైప్‌లైన్ ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ నీటిని అందించనున్నామని, ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా రైతులకు సాగునీటి సమస్యలు తొలగిపోతాయని, వ్యవసాయాభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని, చెక్ డ్యామ్ ద్వారా నిల్వ చేసిన నీటిని సమర్థవంతంగా వినియోగించి గ్రామాలకు సరఫరా చేయడం వల్ల పంటల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, వలసల రామకృష్ణ, హరికిషన్, పరమేష్, శివ, రఫీ, ముస్లిం సోదరులు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల


మాట్లాడుతున్న డ్వామా పీడీ సూర్యనారాయణ

ఉపాధి నిధుల రికవరీకి ఆదేశాలు

- డ్వామా పీడీ సూర్యనారాయణ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై నిధుల రికవరీ చేపట్టాలని డ్వామా పీడీ సూర్యనారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అధ్యక్షతన, ఎంపీడీవో నూర్జహాన్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 31 వరకు జరిగిన పనులకు సంబంధించి నవంబర్ 21 నుంచి డిసెంబర్ 24 వరకు గ్రామాలలో జరిగిన పనులకు 19 వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఆళ్లగడ్డ మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీలలో జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 1336 పనులకు గాను శ్రామిక వేతనాల కింద దాదాపు రూ.6.45 కోట్లు, అలాగే వస్తు సామాగ్రి కింద దాదాపు రూ.2.77 కోట్లు మొత్తం కలిపి దాదాపు రూ.9.22 కోట్ల లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు తెలిపారు. వీటికి సంబంధించిన 1336 పనుల్లో సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి విభిన్నమైన అంశాలను ప్రజావేదికలో చర్చించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ తనిఖీల్లో భాగంగా 87,687 రూపాయలు రికవరీ చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. కొంత నగదు రికవరీ చేయడం జరిగిందని మిగిలిన డబ్బులు రెండు మూడు రోజుల్లో రికవరీ చేస్తామని అధికారులు తెలిపారు. ఆళ్లగడ్డ మండలంలో హార్టికల్చర్ కు సంబంధించి రైతులకు కొంతవరకు క్షేత్రస్థాయిలో అవగాహన లేకపోవడం వల్ల వెనుకబడిందన్నారు. సంబంధిత అధికారులు మొక్కల పెంపకంలో రైతన్నలకు తగు సూచనలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీడి సాంబశివరావు, అంబుర్సు అంబుడ్స్ పర్సన్ మద్దిలేటి స్వామి, సోషల్ ఆడిట్ టీం అధికారి కోనయ్య, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి పరమేశ్వరుడు, ఏపీఓ ప్రతాప్, టిడిపి మండల కన్వీనర్ శీలం హరికుమార్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సామాజిక తనిఖీ బృందం, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు సామర్థ్యం పెంపు

ప్రజాశక్తి - పాణ్యం

పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సామర్థ్యాన్ని ఎంబెడెడ్ సిస్టం పెంచుతుందని రోబోటిక్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈవో వికాస్ రెడ్డి రాపూరు పేర్కొన్నారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఏడు రోజులుగా జరుగుతున్న ఎంబెడెడ్ శిక్షణ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన సూక్ష్మ నియంత్రకాలు, క్రియాశీలక పరికరాలు, రోబోటిక్స్ నియంత్రణ వ్యవస్థలు, ఆటోమేషన్ అనువర్తనాలపై అవగాహన అందించారు. ఈ శిక్షణలో విద్యార్థులకు రోబోటిక్స్ ప్రదర్శనలు, పరిశ్రమలో ఉపయోగిస్తున్న ఎంబెడెడ్ వేదికలపై ప్రత్యక్ష అనుభవం కల్పించారు. స్వయంచాలక వ్యవస్థల రూపకల్పన, ప్రోగ్రామింగ్ అభివృద్ధి, లోపాల పరిష్కారాల విధానాలపై ప్రత్యేక శిక్షణ అందించారు. పరిశ్రమలకు సిద్ధమైన సామర్థ్యాన్ని గణనీయంగా పెంపు చేయడం విద్యార్థుల వృత్తి అభివృద్ధికి ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సాంకేతిక సహాయకులు సిరిల్ ఆరోగ్య దాస్, ప్రిన్సిపల్ జయ చంద్రప్రసాద్, డైరెక్టర్ అశోక్ కుమార్, ఎండి శివరాం, హెచ్ఓడి సోఫియా ప్రియదర్శిని పాల్గొన్నారు.

కెవి సుబ్బారెడ్డి పాఠశాలలో క్రీడా కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ


స్పోర్ట్స్ మీట్ ప్రారంభిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ పట్టణంలోని కె.వి.సుబ్బారెడ్డి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో శనివారం స్పోర్ట్స్ మీట్ ఈవెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఓబన్న అధ్యక్షతన విద్యా సంస్థల డైరెక్టర్లు మల్లేశ్వర రెడ్డి, భూమా శ్రీనివాసరెడ్డి, శ్రీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. స్పోర్ట్స్ మీట్లో విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నర్సరీ నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులకు మూడు రోజులపాటు క్రీడా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని హైస్కూల్ ప్రిన్సిపాల్ ఓబన్న తెలిపారు.. మొదటిరోజు నర్సరీ నుంచి రెండవ తరగతి వరకు చిన్నారులకు స్పోర్ట్స్ ఈవెంట్స్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పిఈటి భాష, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలో రీ సర్వే పూర్తి అయిన గ్రామాల రైతులకు ప్రభుత్వం కొత్త పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేసేందుకు షెడ్యూలు సిద్ధం చేసినట్లు తహశీల్దార్ పద్మావతి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 2న ఏ కోడూరులో గ్రామసభ నిర్వహించి పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 3వ తేదీ కాకనూరు గ్రామంలో, 7వ తేదీ ఎర్రగుంట్ల గ్రామంలో, 8వ తేదీ పరమటూరు గ్రామంలో, 9వ తేదీ పెద్ద దేవలాపురంలో గ్రామ సభలను నిర్వహించి పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తారన్నారు. రైతులందరూ తమ వద్ద ఉన్న పాత పట్టాదారు పాస్ పుస్తకాలను కచ్చితంగా రెవెన్యూ అధికారులకు ఇవ్వాలని, కొత్త పాస్ పుస్తకాలు మాత్రం రైతులకు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్డు వేయండి సారూ..

ప్రజాశక్తి - కోవెలకుంట్ల


మట్టి రోడ్డు ఉన్న దృశ్యం

మండలంలోని కలుగొట్ల గ్రామంలో కొత్తగా ఏర్పడిన సచివాలయం దగ్గర ఉన్న వీధిలో మట్టి రోడ్డు ఉండడంతో ఇబ్బంది పడుతున్నామని, సిసి రోడ్డు వేయాలని స్థానికులు అధికారులను కోరారు. శనివారం స్థానిక మీడియాతో స్థానికులు మాట్లాడుతూ మట్టిరోడ్డుపై వర్షాకాలంలో నడవడానికి చాలా ఇబ్బందిగా ఉందని, సైడ్ కాలు ఏర్పాటు చేశారు కానీ సీసీ రోడ్డు వేయలేదన్నారు. ఇప్పటికైనా సిసి రోడ్డు వేసి ప్రయాణానికి సులువుగా ఉండేటట్టు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను బిసి ఇందిర పరిశీలన

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని కొట్టాల లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తుల సౌకర్యం కోసం చేపడుతున్న ఏర్పాట్లను టిడిపి నాయకురాలు బిసి ఇందిరా రెడ్డి శనివారం పరిశీలించారు. భక్తులకు, సౌకర్యం ఏర్పాట్లను త్వరగా పూర్తిచేయాలని బిసి ఇందిరా రెడ్డి అధికారులకు సూచించారు. భక్తులకు ప్రసాదాలు, ఇతర సౌకర్యాలను బిసి ఇందిరారెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, సాయిరాం, కాసు జంగం శెట్టి, టిఎన్ఆర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీసీ ఇందిరా రెడ్డి

రెండో రోజు కొనసాగిన ప్రచార జాతా

- జాతీయ మహాసభలను జయప్రదం చేయండి
- సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్


విశాఖపట్నంలో ఈ నెల 31 నుండి జరిగే 18వ సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఏసురత్నం కోరారు. శనివారం నందికొట్కూరు పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ దగ్గర మహాసభల జయప్రదం కోరుతూ రెండో రోజు ప్రచార జాతా చేపట్టారు. ఈ జాతా నందికొట్కూరు, పగిడాల, మిడుతూరు, గడివేముల మండలాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.ఏసురత్నం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలను సిద్ధం చేసుకునేందుకు అఖిల భారత మహాసభలలో చర్చించి భవిష్యత్ కార్యాచరణకు రూపొందించనున్నట్లు తెలిపారు. బిజెపి, ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు చేసే దుర్మార్గమైన విధానాలకు వ్యతిరేకంగా కార్మికులను, ఉద్యోగులను, ప్రజలను చైతన్యపరిచి కనువిప్పు కలిగేలా పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. జనవరి 4వ తేదీ మహాసభల అనంతరం విశాఖపట్నంలో లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులతో భారీ బహిరంగ సభ జరిపి ప్రభుత్వానికి ఒక హెచ్చరిక పంపించేలా కదం తొక్కుతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గోపాలకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి రామ్ నాయక్, నాయకులు రాము, ఉస్మాన్, కార్మికులు కృష్ణ, పాండు, స్వాములు, సీతారాం తదితరులు పాల్గొన్నారు. **గడివేముల :** సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ గడివేములలో ప్రచార జాతా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నాగమణి, జిల్లా నాయకులు గోపాలకృష్ణ, రాముడు యాదవ్, మండల అధ్యక్షుడు ఎస్.బాలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహ కార్యదర్శి ఎం నరసింహ నాయక్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో ఎయకులు భాష, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. **చాగలమర్రి :** దేశంలో కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేస్తున్నాయని సిఐటియు జిల్లా నాయకులు గౌస్ తెలిపారు. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా శనివారం చాగలమర్రికి చేరుకుంది. ఈ జీపు జాతా ముత్యాలపాడు బస్టాండు, పెద్ద మకానం, గాంధీ సెంటర్ మీదుగా అడ్డవాగు సెంటర్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తెచ్చిన లేబర్ కోడ్‌లు కార్మిక హక్కులను తొలగించి కార్పొరేట్ యజమానులకు అనుకూలంగా ఉన్నాయన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచకపోవడం కనీస వేతనాలు కూడా అందకపోవడం దారుణమన్నారు. వీటిని వ్యతిరేకిస్తూ జనవరి 4వ తేదీన చలో విశాఖలో జరిగే మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకట లింగం, నాయకులు రాజు, సుబ్బారావు, బుజ్జి, చెన్నయ్య, నాగన్న, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** సిఐటియు జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సిఐటియు జిల్లా నాయకులు కెఎండి గౌస్, వెంకట్ లింగం రత్నమయ్య, మండల కన్వీనర్ రాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ గిడ్డంగుల వద్ద హమాలీ యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జీపు జాతాకు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక బస్టాండ్ వద్ద జరిగిన కార్యక్రమంలో కెఎండి.గౌస్, రత్నమయ్య మాట్లాడారు. విశాఖ సభకు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ నాయకులు శ్రీనివాసులు, చిరంజీవి, మధు, కర్ణాకర్, వివోఏల సంఘం నాయకులు మునుస్వామి, శిరోమణి, నాయకులు నాగరాజు, అంగన్వాడి వర్కర్ సీనియర్ నాయకులు వెంకట రమణమ్మ తదితరులు పాల్గొన్నారు. **మిడుతూరు :** సిఐటియు జాతీయ మహాసభల జయప్రదం కోరుతూ మిడుతూరులో జీపు జాతాను ప్రారంభించారు. సిఐటియు జిల్లా నాయకులు నాగమణి, గోపాలకృష్ణ, రాము యాదవ్, మండల కన్వీనర్ ఐజయ్య, ఓబులేసు, లింగస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో మండల నాయకులు కళ్యాణి, రమణమ్మ, వెంకటేశ్వర్లు, నారాయణ, రాజు, మధు కుమార్, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.


నందికొట్కూరు : మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం


గడివేముల : మాట్లాడుతున్న నాయకులు



బండి ఆత్మకూరు : మాట్లాడుతున్న నాయకులు


మిడుతూరులో..


దేశ రక్షణకు కమ్యూనిస్టుల ఐక్యత అనివార్యం

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్

దేశ రక్షణకు కమ్యూనిస్టుల ఐక్యత అనివార్యమని, భారత రాజ్యాంగాన్ని మనుస్మృతిగా మార్చాలని చూస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ శక్తుల పతనానికి కమ్యూనిస్టుల ఐక్యతే పునాది కావాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సిపిఐ శతజయంతి ఉత్సవాల సందర్భంగా శనివారం నంద్యాల పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో 'కమ్యూనిస్టుల ఐక్యత – నేటి ఆవశ్యకత' అంశంపై సదస్సు జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చాక దేశంలో రూపాయి విలువ పాతాళానికి పడిపోగా, నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని విమర్శించారు. సిబిఐ, ఇడి, ఎన్నికల సంఘం వంటి స్వయం ప్రతిపత్తి గల సంస్థలను గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్షాలను వేధిస్తున్నారని మండిపడ్డారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చేలా నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం దుర్మార్గమన్నారు. 2004లో కమ్యూనిస్టుల అండతోనే ఉపాధి హామీ, సమాచార హక్కు వంటి చట్టాలు సాధ్యమయ్యాయని వివరించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కె. రామాంజనేయులు, పి.రామచంద్రయ్య మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు పార్టీలన్నీ కలవాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. అడవుల్లో మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో చంపడం హేయమైన చర్య అని ఖండించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాజధాని పేరుతో మళ్ళీ భూసేకరణ చేస్తూ సన్నిహితులకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోని ప్రభుత్వం, కార్పొరేట్ల రుణాలను మాత్రం లక్షల కోట్లలో మాఫీ చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో టిడిపి, వైసిపిలకు ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు మూడవ శక్తిగా ఎదగాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, సిపిఎం సీనియర్ నాయకులు శంకరయ్య, సిపిఐ ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకులు మనోహర్ మాణిక్యం, ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, భార్గవ్, రఘు రామమూర్తి, భాస్కర్, నాగరాముడు, పట్టణ కార్యదర్శి ప్రసాద్, సహాయ కార్యదర్శులు లక్ష్మీదేవి, నాయకులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ


నివాళులర్పిస్తున్న దృశ్యం

అనారోగ్యంతో టిడిపి కార్యకర్త మృతి

- మాజీ ఎంపిపి నివాళి

ప్రజాశక్తి - సిరివెళ్ల

మండల పరిధిలోని గుండంపాడు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త కుమ్మరి శ్రీనివాసులు (75) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి గుండంపాడు గ్రామానికి చేరుకొని శ్రీనివాసులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ తరపున అన్ని విధాల అండగా ఉంటామని భరోసానిచ్చారు. కుమ్మరి శ్రీనివాసులు వంటి నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. అలాగే పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు శ్రీనివాసులు మృతదేహానికి నివాళులర్పించారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని అహోబిలం రోడ్డులో రహమాన్ కూల్ డ్రింక్ షాప్ సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఫ్యూజ్‌లతో ప్రమాదం పొంచి ఉంది. మెయిన్ రోడ్డుపై కేవలం మూడు అడుగుల ఎత్తులోనే ఫీజు క్యారియర్లు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఈ రోడ్డులో రెండు మూడు పాఠశాలలు కూడా ఉన్నాయి. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ఫీజు క్యారియర్లను ఎత్తులో ఏర్పాటు చేసి రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


కిందకు ఉన్న ఫ్యూజ్ క్యారియర్లు

భక్తులకు ఉచిత అన్నదానం

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మండలం కొండమాయపల్లె పొలిమేర పరిధిలో వెలసిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో శిరివెళ్ల సొసైటీ చైర్మన్ కొండమడుగుల శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.


అన్నదానం చేస్తున్న శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు

నాపరాయి లోడ్ ట్రాక్టర్లు బోల్తా

- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

రెండు నాపరాయి లోడ్ ట్రాక్టర్లు అదుపు తప్పి బోల్తా పడిన ఘటన కొలిమిగుండ్ల మండలంలో శనివారం చోటుచేసుకుంది. మండలంలోని అంకిరెడ్డి పల్లె సాయిబాబా గుడి సమీపంలోని మలుపు వద్ద రెండు ట్రాక్టర్లు అంకిరెడ్డి పల్లె నుండి తాడపత్రికి నాపరాతి రాళ్లను లోడు చేసుకొని చేసుకొని వెళుతున్నాయి. రెండో మలుపు వద్ద ట్రాక్టర్‌ను మరో ట్రాక్టర్ క్రాస్ చేసే సమయంలో ఎదురుగా జీపు వస్తుండడంతో ట్రాక్టర్ డ్రైవర్లు వేగాన్ని నియంత్రించుకోలేక అదుపుతప్పి బోల్తా పడ్డాయి. ట్రాక్టర్ డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించి తప్పించుకొని పక్కకి దూకడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు.

జొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఎఒ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని రైతులు సాగు చేసిన జొన్న, సెనగ పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని సింగవరం, పార్నపల్లె గ్రామాల్లో రైతులు సాగు చేసిన జొన్న, మినుము పంటలను ఆయన పరిశీలించారు. కత్తెర పురుగు నివారణ కోసం కొరాజిన్ క్రిమిసంహారకమందును వ్యవసాయ శాఖ సూచనల మేరకు పిచికారి చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. సస్యరక్షణ చర్యల ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చున్నారు.మండలంలో యూరియా రైతుల అందరికీ రైతు సేవా కేంద్రాల్లో, సహకార సంఘాల్లో అందుబాటులో ఉందని, ఎవరు ఆందోళన పడొద్దన్నారు. స్టాక్ వివరాలను కూడా ప్రదర్శిస్తారని తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం సొంతం

ప్రజాశక్తి - బనగానపల్లె : విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితే విజయం సాధించవచ్చని అనిమోటివేషనల్ స్పీకర్ సి జ్యోతిర్మయి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలలో, కర్నూలు యువజన సర్వీసుల శాఖ సెట్కూరు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సిలింగ్‌పై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మోటివేషనల్ స్పీకర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగితే విజయ శిఖరాలను అధిరోహించవచ్చున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద రావు మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు విద్య ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, సెట్కూరు సిబ్బంది శ్రీనివాస సింగ్, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో తెలుగు బాప్టిస్ట్ చర్చి అధ్యక్షుడు మృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్ల మండలం సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన తెలుగు బాప్టిస్ట్ కృపాలయం చర్చి అధ్యక్షులు జోసఫ్ (83) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బేతంచర్లఎంపీపీ బుగ్గన నాగభూషణ్ రెడ్డి, సిమెంట్ నగర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎస్తేరమ్మ జెసెఫ్ ఇంటి వద్దకు వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. వారి వెంట ఎంపీటీసీ ఇందిరమ్మ వైసీపీ నాయకులు యాకోబు, యోబు, జోసఫ్, శివ తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైసీపీ నాయకులు యాకోబు

సిసి రోడ్డు గుంతలమయం

ప్రజాశక్తి - సంజామల

మండలంలోని గిద్దలూరు గ్రామంలోని పశువుల ఆసుపత్రి వద్ద కాలువపై ఉన్న సిసి రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ బ్రిడ్జి రోడ్డుపై మిక్కినేనిపల్లి, లింగందిన్నె, తుడుమలదిన్నె గ్రామాలకు నిత్యం వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రోజు వెళ్లేవారు మాత్రం కొద్దిగా నిదానంగా వెళతారు. కొత్తవారు వేగంగా వెళ్లడం వలన ఎన్నోసార్లు కిందపడి గాయాల బారిన ఘటనలు అనేకం ఉన్నాయి. సంబంధిత అధికారులకు తెలిపినా బ్రిడ్జి రోడ్డుపై గుంతలకు మరమ్మతులు చేయడం లేదని వాహనదారులు వెంకటేశ్వర్లు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని గుంతలు పూడ్చాలని గ్రామ ప్రజలు, వాహనదారులు, ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.


గుంతలు పడిన సిసి రోడ్డు


మాజీ ఎమ్మెల్యేకు పూలమొక్క అందజేస్తున్న సర్పంచి

మాజీ ఎమ్మెల్యేను కలిసిన సర్పంచి

ప్రజాశక్తి - శిరివెళ్ళ

మడలంలోని మహాదేవపురం గ్రామ పంచాయితీ సర్పంచ్ పెద్ది రమణయ్య ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డిని ఆయన స్వగృహంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల మొక్కను అందజేసి ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, భవిష్యత్ కార్యక్రమాలపై సానుకూలంగా చర్చ జరిగినట్లు సర్పంచ్ తెలిపారు. ప్రజల సంక్షేమానికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి తెలిపినట్లు సర్పంచి పేర్కొన్నారు. అనంతరం సర్పంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ముందుగా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మహాదేవపురం గ్రామ అభివృద్ధే ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామ సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తామని, ప్రజలు ఐక్యతతో ముందుకు రావాలని కోరారు. రాబోయే నూతన సంవత్సరం ప్రజల జీవితాల్లో వెలుగు నింపాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి-ప్యాపిలి

మండలంలోని పోతుదొడ్డి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వివరాలు.. మిడుతూరు గ్రామానికి చెందిన రెడ్డి పోగుల రాజేష్ (32), నవీన్(22) ఆటోలో ప్రయాణిస్తుండగా వెనక భాగం నుండి కారు వేగంగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రాజేష్, నవీన్‌లను అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. రాజేష్‌కు భార్య కళావతి, కూతురు వర్ష, నవీన్‌కు భార్య స్వీటీ ఉన్నారు. స్థానిక ఎస్ఐ నాగార్జున కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

త్వరలోనే కొత్త పాసు పుస్తకాలు

ప్రజాశక్తి-వెలుగోడు

రీ సర్వే పూర్తి అయిన గ్రామాలలో రాజముద్రతో కూడిన పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెలుగోడు మండలంలో రీ సర్వే పూర్తి అయిన గుంతకందాల గ్రామంలో 2026 జనవరి 3న, 6న అబ్దుల్లాపురం గ్రామంలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ గ్రామ సభకు ఆయా గ్రామాల రైతులు హాజరై వారి పొలాలకు సంబంధించిన పాసుపుస్తకాలు తీసుకోవాలని సూచించారు. ఏవైనా తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.